ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

అక్టోబర్ 23, 2005

Entered

రంజాన్ స్పెషల్ హలీమ్

చిన్నయుద్ధం... పెద్ద పర్యవసానం

టర్నింగ్ పాయింట్

ఎవరి పరుగు వారిది

సినిమా కబుర్లు

అరవకండి-అర్థం చేసుకోండిలా..

ఇంటి సంగతులు

(23.10.2005 నుంచి
29.10.2005 వరకు)

హ్యాపీ బర్త్‌డే

కె. మహతి
2సం॥, అక్టోబర్-2003
సమత-జయరాం
ఆర్టీసీ క్రాస్‌రోడ్స్-హైదరాబాద్

రెడ్డిసుమంత్
1సం॥, 23.10.2004
సుజాత-రాము
రెడ్డివానివలస-విజయనగరం

సిహెచ్. స్వాతి
9సం॥, 23.10.1996
లక్ష్మి-సింహాచలం
సీతానగరం-విజయనగరం

సిహెచ్. శ్వేత
9సం॥, 23.10.1996
లక్ష్మి-సింహాచలం
సీతానగరం-విజయనగరం

పి. పవన్‌తేజ
2సం॥, 23.10.2003
వరలక్ష్మి-కోదండరాము
అంతర్వేదిపాలెం-తూ॥గో

సదాశివ
1సం॥, 25.10.2004
పద్మ-సోమశేఖరరెడ్డి
చిత్తలూరు-నల్లగొండ

బి. మణికంఠ
4సం॥, 23.10.2001
పుష్ప-నర్సయ్య(రెమో)
తాటిపాముల-నల్లగొండ

బి. మేరి సింధూరి
4సం॥, 23.10.2001
రత్నసరోజిని-మరియదాసు
గుంటూరు

జి. శాంభవి
1సం॥, 25.10.2004
కళ్యాణి-గోపి
నకిరేకల్-నల్లగొండ

పి. హేమలత
6సం॥, 25.10.1999
లక్ష్మి-సన్యాసిరావు
బొబ్బిలి-విజయనగరం

జి. రోహిత్
2సం॥, 26.10.2003
తులసి-సత్యనారాయణ
పాతపట్నం-శ్రీకాకుళం

కె. సుచరిత
8సం॥, 26.10.1997
రత్నకుమారి-మోహన్‌చంద్
శావల్యాపురం-గుంటూరు

పి. సోనియ
5సం॥, 26.10.2000
సుజాత-రవిబాబు
కుర్నూతల-గుంటూరు

తేజ
1సం॥, 25.10.2004
సంతోషి-మోహన్‌రెడ్డి
శంషాబాద్-రంగారెడ్డి

నూప్రా
2సం॥, 28.10.2003
నాగమణి-శ్రీనివాసరావు
వైరా-ఖమ్మం

కె. కె.డి. రాజ్
6సం॥, 28.10. 1999
లక్ష్మిరాజేశ్వరి-మురళీశ్రీనివాస్
ఇంద్రపాలెం-తూ॥గో

బి. అరుణ్‌సాయి
స్వరూపరాణి-రవీందర్
దోమలగూడ-హైదరాబాద్

సంజన
వరలక్ష్మి-నరసింహ
బైరంకొండ-మ॥నగర్

జి. నేహా(అమ్ములు)
4సం॥, అక్టోబరు-2001
హేమలత-వేణు
యఫ్.సి.ఐ కాలనీ-నల్లగొండ

ఐ.ప్రశాంతి
6సం॥, అక్టోబర్-1999
కవిత-రాజా
బాలాజీనగర్-నెల్లూరు

నహీద్
హసీనా-షమ్మీరాజా
అరవపల్లె-కడప

సాయి శ్రీ హాసిత(సిరి)
2సం॥, అక్టోబర్-2003
సమత-రంగారావు
మునగచర్ల-నందిగామ

ఎం. చంటి
1సం॥, అక్టోబర్-2004
రమణ-సురేందర్
ముస్తాఫానగర్-ఖమ్మం

ఎస్. సాయి సృజల్ కుమార్
2సం॥, అక్టోబర్-2003
దివ్యశ్రీ-శివకుమార్
శివాజీనగర్-కరీంనగర్

షబానా
1సం॥, అక్టోబర్-2004
షహీన-రసూల్
మద్దికెర-కర్నూలు

సుభాని
5సం॥, అక్టోబర్-2000
మాబున్ని-ఖాజవలి
గిద్దలూరు-ప్రకాశం

షహీద
6సం॥, అక్టోబర్-1999
మాబున్ని-ఖాజవలి
గిద్దలూరు-ప్రకాశం

ఈ వారం అతిథి

మన అతిథి గురించి...

పేరు	:	కె. నాగేశ్వర్,
పుట్టిన తేదీ	:	20 నవంబర్ 1963
పుట్టిన ఊరు	:	అదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్
విద్య	:	మాస్టర్ ఆఫ్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం (ఎంసిజె), పి.హెచ్‌డి.
వృత్తి	:	అసోసియేట్ ప్రొఫెసర్, జర్నలిజం శాఖ, ఉస్మానియా యూనివర్సిటీ
నచ్చినవ్యక్తి	:	అమర్త్యసేన్
నచ్చని అంశం	:	మొహమాటంతో మాట్లాడటం
హాబీ	:	నిరంతరం కొత్త అంశాలు కొత్త సమాచారం అన్వేషించడం.



వ్యక్తి... సామాజిక స్వభావం కోల్పోకూడదు

మన సమాజంలో విలువల పతనం పెరిగింది. అన్ని వర్గాల వారిపైన దీని ప్రభావం ఉంది. ఒకనాటి సమాజంలో వలే ఒక గాంధీ మహాత్ముడో, ఒక జవహర్‌లాల్ నెహ్రూనో సమాజానికంతటిపై సార్వత్రిక ప్రభావం చూపేటి వ్యక్తుల, వ్యవస్థల కొరత ఏర్పడింది. మరో కారణం ఏమంటే... ఆర్థికవాదం, వస్తువ్యామోహ సంస్కృతి, రాత్రికి రాత్రికి కుబేరులయిపోవాలనే డబ్బు కాంక్ష(క్విక్ మనీ కల్చర్) అనేది ఈ సమాజ కేంద్రకస్థాయికి చేరింది. డబ్బు సంపాదించాలనుకోవడం, దాన్ని అనుభవించాలనుకోవడం తప్పుకాదు. ఏ కాంక్ష, ఏ ఆశ, ఏ కోరిక లేకుండా ఏ సమాజ గమనమూ ఉండదు. కానీ ఈ క్విక్ మనీ కల్చర్ ముందు ఏ విలువలూ వలువలతో ఉండవు. ఎలా సంపాదించావని అడగటం లేదు, ఎంత సంపాదించావని అడిగే స్థాయికి వెళ్లిపోయిందీ సమాజం. మూడో కారణం...పలాయన మనస్తత్వం. ఎవరో వచ్చి ఈ సమాజాన్ని మార్చాలని చూస్తున్నారు. వ్యక్తులుగా తామూ ఈ సమాజమార్పు కోసం పనిచేయాలనేది పోయింది

ఒక సమూహంగా ఉండటమనేది ప్రకృతిలో ప్రతి జీవరాశి స్వభావమే. చీమలన్నీ ఒక సమూహంగా ఉంటాయి. పశువులన్నీ కలిసే ఇంటికి తిరిగొస్తాయి. గొర్రెలు గుంపుగానే తిరుగాడుతాయి. కానీ మానవులు ఆ సంఘజీవనంలో వ్యక్తివాదానికే ప్రాముఖ్యతనిస్తున్నారు. తన వ్యక్తిగత ప్రయోజనానికి సమాజహితాన్ని బలిపెడుతున్నారు. ఐన్‌స్టీన్ తన అణుసిద్ధాంతం దుర్వినియోగమవ్వటం చూసి "ఇండివిడ్యువల్ వెర్సెస్ కలెక్టివ్" అనే రచనలో వ్యక్తి సామాజిక స్వభావం కోల్పోతున్నాడని వాపోయాడు. దీనిమూలంగా సమాజహితానికి బదులు సమాజమే తన కోసం పనిచేయాలనే దశకు చేరుకున్నాడు. ఇది అన్ని రంగాలకు పాకింది. దీనికి మించి పాశ్చాత్య సంస్కృతి పేరిట విశృంఖలత విజృంభించింది. ఇక విలువలకు స్థానమెక్కడిది?

నేడు "స్వాతంత్ర్యోద్యమ మహనీయుల స్మారకార్థం రాతి విగ్రహాలు కడుతున్నారు. వారి విలువలను రాళ్లతో కొడుతున్నారు" అన్నట్లయిపోయింది. ఉదాహరణకు మొన్నటి గాంధీ జయంతికి కొద్ది రోజుల ముందు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గాంధీ ప్రవచించిన అన్ని విలువలకూ తిలోదకాలిచ్చి, ఎన్నికలయ్యాక గాంధీగారి విగ్రహానికి దండలేశారు. ఇంతటి విరుద్ధత ఏ సమాజంలోనూ ఉండదు. మన సమాజానికి తక్షణ సృజనాత్మక ప్రతిబింబమైన సినిమా విషయాన్నే తీసుకోండి. ఏ రకమైన విలువలకు ప్రతినిధిగా హీరోయిజాన్ని చూపిస్తున్నారు? కేవలం సినిమా టైటిళ్ల దిగజారుడు చూస్తే చాలు ఈ సమాజ పతనం తెలుస్తుంది. ***విలువల పతనం వల్ల ఎవరు బాధితులవుతున్నారో వాళ్లు తిరగబడ్డప్పుడే దీనికి విరుగుడు. ప్రజాసమీకరణే మార్పుకి ఛోదక శక్తి.***

తామెంచుకున్న ఏ రంగంలోనైనా అత్యున్నత ప్రమాణాలను ప్రదర్శించాలనే ఆకాంక్ష పెరగాలి. అసాధ్యమనేది అసమర్థుని నిఘంటువులో మాత్రమే కనిపించాలి. నిరంతరం కొత్తదనాన్ని అన్వేషించే, ఆస్వాదించే ఆలోచనా సరళి పెరగాలి. విలువలు మాత్రమే సమాజాన్ని నడిపించలేవు. సామర్థ్యం ఉత్పాదకత, సమున్నత విలువలకు తోడుగా నిలవాలి. సమాజం నీతిచంద్రికల వల్ల మాత్రమే బాగుపడదు. సమాజానికి సుమతి శతకం ఎంత అవసరమో సంపదలను సృష్టించే సామర్థ్యం కూడా అంతే అవసరం. యువతరాన్ని సంపదలను సృష్టించేవారుగా తయారుచేయాలి.

కె నాగేశ్వర్

ఈ సంచికలో...

టపా ... 2
టర్నింగ్‌పాయింట్ ... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
నేర్చుకుందాం..రా! 7
క్యాంపస్ చాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు 12
అట్టమీది కథ ... 14
తెంగ్లీష్ 20
ఓ ఊరి కథ ... 21

సీరియల్ 16
మాధవి

ఇంకా...

మనసా తెలుసా 3
ప్రేమనగానే
మెదడులో కదలికలేంటబ్బా!

ఎవరు అనాథ
కథ 18

ఆరోగ్యం ... 17
పప్పెట్ ఇంటర్వ్యూ ... 19
అవీ... ఇవీ 22
విజ్ఞానవీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24

ఏ వారానికావారం

అట్టమీదికథనాలు ఏ వారానికా వారం హైలైట్‌గా నిలుస్తున్నాయి. స్నేహ వినూత్నంగా తయారై పెద్దలనూ, పిల్లలనూ ఎంతగానో అలరిస్తోంది. సరికొత్త రూపంలో, కొత్త శీర్షికలతో విజ్ఞానాన్ని, ఆనందాన్ని కలిగిస్తోంది.

ధనాల చంద్రహాస్, పామర్రు.

ఆనందపరిచేలా

లవకుశ సూపర్ హిట్... తెర వెనుక తెరపై కృషి బాగుంది. అట్ట మీద కథ జంఝావతి రబ్బర్ డ్యామ్ బాగుంది. మేధా పాట్కర్ కోరికమేరకు రబ్బరు డ్యామ్స్ నిర్మించాలి. "బి1" విటమిన్ అవశ్యకత తెలిసింది. మోటుపల్లి గ్రామం అలా అవ్వడం విచారకరం. బాలల కథ బాగుంది. స్నేహ సకల జనులనూ ఆనందపరిచేలా ఉంటోంది.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు-2.

ఊహించాలన్నా ...

మాధవి సీరియల్ మా కుటుంబ సభ్యులందరికీ ఎంతో ఇష్టమైంది. ఆదివారం ఇంకా రాలేదేంటా? అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నాం. గాలవుడు ఎందుకు ఆమెను ఇంతలా బాధ పెడుతున్నాడు? చివరికేం అవుతుంది? అనే విషయాలు ఊహించాలన్నా మా ఊహలకందడం లేదు. పురాణ కథలంటే కొన్ని పదాలు అర్థంకావు. కాని ప్రతి పదం అర్థమయ్యే రీతిలో ఉంటోంది. ఇంత మంచి సీరియల్ అందిస్తున్నందుకు ధన్యవాదాలు.

బంగారు శేఖర్ బాబు.
కె.డి. పేట,విశాఖ జిల్లా.

ఇప్పటికీ సూపర్ హిట్టే...

'లవకుశ' చిత్రం ఇప్పటికీ సూపర్ హిట్టే. సినిమా కబుర్లు ద్వారా చిత్రాన్ని పరిచయం చేయడం చాలా బాగుంది. ఈస్ట్‌మన్ కలర్లలో వేలాది చిత్రాలొచ్చినా 'లవకుశ' చిత్రమే ఉత్తమంగా నిలవడం గొప్ప విషయం.

- రాళ్లబండి రాజన్న, శ్రీరాంపూర్ కాలని

కళ్లకు కట్టినట్లుగా...

"స్నేహ"లో ప్రచురితమైన "ఓ ఊరి కథ" శీర్షిక చాలా బాగుంది. ఇలాంటివన్నీ చాలా విజ్ఞానదాయకంగా ఉంటున్నాయి. మోటుపల్లి రేవు పట్టణం గురించి మేం చిన్నప్పుడు సాంఘిక శాస్త్రంలో చదువుకున్నాం. దీని విశేషాలు స్నేహలో ప్రచురించడం ద్వారా మేం అప్పుడు నేర్చుకున్నది గుర్తుచేశారు. పురాతన దేవాలయాలు, నాటి కట్టడాలు ఈనాడెలా దోపిడీకి గురవుతున్నాయో కళ్లకు కట్టినట్లుగా వివరించారు. ఇంటిసంగతులు శీర్షికలో ఇదేం వానో ఏమో తెలంగాణా యాసలో రాశారు. చాలాబాగుంది.

జె. శ్రావణి, పాల్వంచ.

"స్నేహ"తో స్నేహం

'రుచి'లోని బొప్పాయి పెరుగు పచ్చడి చదివి, వండాను. బాగా వచ్చింది. సినిమా కబుర్లు చాలా విషయాలు తెలియజేస్తున్నాయి. ఈ వారం అతిథిలో ఎ.మంజులత కుటుంబ వ్యవస్థపై పాశ్చాత్య ప్రభావాన్ని బాగా వివరించారు. ప్రజాసంస్థలతో పాటు విద్యాసంస్థలలో పనిచేసే వారిలోనూ అంకితభావం, నిబద్ధత కనిపించడం లేదు. మార్పు రావాలి.

ఆర్. రాజావల్లి, హిమకుంట్ల గ్రామం,
కడప జిల్లా.



తెప్పించి వండేసా...

రుచి శీర్షికలోని అరటి వంటకాన్ని చదివి, వెంటనే వండేశా. దాన్ని ఇంటిల్లిపాది ఇష్టంగా తిన్నాం. "అవి... ఇవీ" లోని "నువ్వెంత ఆకాశ హర్మ్యానివైనా ఇసుక రేణువుల పొందికవేనని గుర్తుంచుకో" అన్న వ్యాఖ్య, చిత్రం దూరతీరాలలో రాసినవి మరీనచ్చాయి. పప్పెట్ ఇంటర్వ్యూ శీర్షికలోని 'కప్పల బాగోతం", బాలల కథ శీర్షికలోని "సంతోషం" బాగున్నాయి.

దివ్య, ఖమ్మం

బాగానచ్చింది

"ఇంటి సంగతులు"లో "ఇంటికో భాష మాటకో తీరు" అన్న రచనలో తెలంగాణ యాసతో వివరించిన విధానం చాలా బాగుంది. అక్టోబర్ తొమ్మిదిన "గిదేం వానో ఏమో" అన్న రచనలోనూ తెలంగాణా యాస మాకు చాలా బాగానచ్చింది. ఇలాంటి రచనలు మరెన్నో రావాలని కోరుకుంటున్నాం.

అనిత, విజయ, శ్రీదేవి, లక్ష్మీ, సరోజ, నెల్లూరు.

మనసా... తెలుసా?

ప్రేమ మత్తులో ఉన్నంతసేపు, హార్మోన్ల విషయంలో, స్త్రీలు పురుషులుగాను, పురుషులు స్త్రీలుగాను మారిపోతారని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

హిప్నో కమలాకర్

కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్,
ఫోన్ : 9849130141

ప్రేమనగానే మెదడులో కదలికలేంటబ్బా!

ప్రేమ ఒక మధురానుభూతి....అనిర్వచనీయమయిన అనుభవం...' అంటారు ప్రేమికులు. ఆ అనుభవం స్త్రీపురుషుల్లో ఉండే టెస్టోస్టిరాన్ హార్మోన్ కారణంగా మాత్రమే నిర్ధారితమౌతుందని మారాజిట్ అనే ఇటలీ శాస్త్రవేత్త అధ్యయనంలో తేలింది. ప్రేమ మత్తులో ఉన్నంతసేపు, హార్మోన్ల విషయంలో, స్త్రీలు పురుషులుగాను, పురుషులు స్త్రీలుగాను మారిపోతారని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

శారీరక మార్పులు

ఇటలీలోని పీసా విశ్వవిద్యాలయానికి చెందిన డొనాటెల్లా మారాజిటి అనే శాస్త్రవేత్త ప్రేమలో పడ్డవారిలో సంభవించే శారీరక, మానసికమార్పులపై చాలా కాలంగా పరిశోధనలు చేస్తున్నారు. ప్రేమికుల్లో సెరటోనిన్ అనే న్యూరోట్రాన్స్‌మిటర్ సాధారణ స్థాయి కన్నా తక్కువగా ఉంటుందని గతంలో ఈమె చేసిన పరిశోధనల్లో తేలింది. ప్రేమలో పడ్డ తొలిరోజుల్లో ప్రేమికులు ఒకరిపై మరొకరు అత్యంత ఆసక్తి చూపటానికి ఇదే కారణమని మారాజిటి చెప్పారు. ఈవిడ చేసిన మరో అధ్యయనంలో ఇంకో ఆసక్తికరమైన అంశం వెల్లడైంది. ప్రేమలో పడ్డ పురుషుల్లో టెస్టోస్టిరాన్ అనే హార్మోన్ తక్కువగాను...ఆడవాళ్లలో ఎక్కువగాను ఉంది. టెస్టోస్టిరాన్ పురుషుల్లో లైంగికవాంఛను కలిగిస్తుంది. వాస్తవానికి ప్రేమలో పడిన పురుషుల్లో ఈ హార్మోన్ ఎక్కువగానూ, స్త్రీలలో తక్కువగా ఉండాలి. ఈ అధ్యయనంలో ఇది పూర్తి విరుద్ధంగా ఉన్నట్లు తేలింది. దీనికి సరైన కారణం శాస్త్రజ్ఞులు చెప్పలేకపోతున్నారు.

"ప్రేమలో పడ్డ స్త్రీ ,పురుషుల మధ్య తేడాలను రూపు మాపటానికి ప్రకృతి ఇలాంటి ఏర్పాటుచేసి ఉంటుంది" అని మరాజిటి వ్యాఖ్యానిస్తున్నారు. "ప్రేమలేని సెక్సు అసమంజసనీయమైనదని నిరూపిస్తే బాగుణ్ను" అని నైతిక సూత్రాలకు కట్టుబడే వ్యక్తులు భావిస్తారు. ప్రేమలో పడితే గానీ సెక్సు రమ్యంగా ఉండదని ఎక్కడా లేదు. అందుకు శాస్త్రీయ ఆధారాలూ లేవు. ప్రేమ ఉండీ, రమ్యత లోపించిన సెక్సును శాస్త్రజ్ఞులు చాలామందిలో గమనించారు. (మాస్టర్స్ అండ్ జాన్సన్స్)

ప్రేమలో పాటించాల్సిన విలువలు

"ప్రేమ" లైంగికంగా వినియోగించుకోబడుతున్నానేమోనన్న భావన నుండి రక్షిస్తుంది. ప్రేమ పరస్పర అవగాహన, గౌరవంలాంటి అంశాలతో ముడిపడి ఉంటుంది. ప్రేమలేని సెక్సు సంబంధాలలో అవతలివ్యక్తి భావాలు తెలియవు. ఫలితంగా అపార్థాలు తలెత్తుతాయి. లైంగికంగా ఎక్కువగా వినియోగించుకోబడుతున్నామనే భావన కలుగుతుంది. ప్రేమ విభిన్న రూపాలలో కన్పిస్తుంది. తల్లి, పిల్లలు, సోదరప్రేమ ప్లేటోనిక్ ప్రేమలు దీని ఉదాహరణలు. రొమాంటిక్, స్థిరమైన ప్రేమ రూపాలలోనూ వ్యక్తుల లైంగిక ప్రసక్తి లేకపోవచ్చు. ఇటువంటి స్వచ్ఛమైన రూపాలలో వ్యక్తులు తమ మధ్యగల శారీరక ఒద్దికకు అవకాశమివ్వరు. మతపరమైన నమ్మకాలు, లైంగికాసక్తి లేకపోవడం, పెళ్లయ్యేదాకా ఆగాలనే కోరిక మొదలైనవి ఈ ప్రవర్తనకు కారణాలు.

"లైంగిక క్రియకు మేమిద్దరం బందీలమయ్యామనీ...ఇతర సంబంధాలను అలక్ష్యం చేస్తున్నామనీ...అనిపిస్తోంది. సెక్సు చేసుకోకూడదని నిర్ణయించుకున్నాక, మేమిద్దరమూ మరింతగా ప్రేమించుకోవటానికి సమయం సానుకూలమౌతోంది. మేం ప్రగాఢంగా వాంఛించేదీ ఇదే!" ఇది ప్రేమలో పడ్డ ఒక యువకుడి అభిప్రాయం.

అనేక మంది, లైంగికంగా, "ఏది మంచిది. ఏది చెడు?" వంటి ప్రశ్నలతో తీవ్రంగా మధన పడుతుంటారు. వివాహానికి ముందు, లైంగిక సంబంధాల నేర్పరుచుకోవడంలో గల మంచిచెడులను గురించి యుక్తవయస్కులకు నిర్దుష్టంగా తెలియదు. "నైతికంగా పతనమయిపోతున్నామా? లేక పెళ్ళయ్యాక కూడా వివాహేతర సంబంధాల పట్ల మనసు పోతుందా?" అన్పిస్తుంది. ఇద్దరి మధ్యా ప్రేమ ఉంటే సమస్య మరీ జఠిలమౌతుంది. "మరొకరిపై మనసు లాగుతోందంటే, ప్రేమిస్తున్న వ్యక్తిపై ప్రేమ తగ్గిపోయినట్లేనా? ఇది ప్రేమను, నమ్మకాన్ని చెడగొడ్తుందా? **లైంగిక నిర్ణయాలకు** ప్రేమ ప్రసక్తి అవసరమా?" మొదలైన ప్రశ్నలకు సమాధానం చెప్పే సరళమైన సూత్రమేదీ లేదు. ప్రతి వ్యక్తీ తన నమ్మకాలు, అనుభవాల రిత్యా నిర్ణయించుకోవటానికి ప్రయత్నిస్తారు. హద్దులు దాటితే కొన్ని బెడిసికొట్టొచ్చు. మరికొన్ని సందర్భాలలో, చొరవ చూపడం, ప్రేమకు పునాదిగా మారొచ్చు. మరికొందరి విషయంలో అది నేరం... ఇంకొందరి విషయంలో పతనంగానూ మారొచ్చు. పెళ్లయిన తరువాత, లైంగిక సామర్థ్యం చూపలేని సమస్యలకు దారి తీయొచ్చు. ఈ సంఘర్షణలకు దారితీసే అంశాలను గుర్తించడం ద్వారా లైంగిక నిర్ణయాలను ధృవీకరించుకోవచ్చు. ✣

టర్నింగ్ పాయింట్

వకుళాభరణం రామకృష్ణ

చిన్న యుద్ధం - పెద్ద పర్యవసానం

భారతదేశాధిపత్యం కోసం, ఆధునిక యుగంలో, జరిగిన పెనుగులాట, ఐరోపా దేశాల మధ్య ఒకవైపుగా, మరోవైపు ఐరోపా దేశాలకు భారతదేశంలోని రాజ్యాలకు మధ్య జరిగింది. ఈ క్రమంలో అనేక యుద్ధాలు జరిగాయి. ఎంతో ధననష్టం, జననష్టం జరిగి, దేశం పరాధీనం కావడమేగాక, ఆర్థికంగా చితికి పోయింది కూడా.

1600వ సంవత్సరం నుండి ఆంగ్లేయులు, ఈస్ట్ ఇండియా కంపెనీ పేరుతో వర్తక వాణిజ్యాల కోసం, భారతదేశంలోకి అడుగు పెట్టారు. అంతకుముందే పోర్చుగీస్‌వారితో ప్రారంభమై డచ్చి, ఫ్రెంచి కంపెనీలు దేశంలో తిష్టవేసుకుని కూర్చున్నాయి. అప్పట్లో దేశాన్ని ఏలే మొఘలు చక్రవర్తులు వీరికి రాయితీలు కల్పించి, వర్తక వాణిజ్యాలకు అనుమతిచ్చారు. విదేశీ కంపెనీల దురాలోచన, వ్యూహం వారికి అంతు చిక్కలేదు. ముఖ్యంగా ఆంగ్లేయులు, అనుసరించదలచుకున్న వ్యూహాత్మక పథకం (ఫ్లాగ్ ఫాలోస్ ట్రేడ్ 'వాణిజ్యం వెంట జెండా, అంటే రాజకీయ అధికారం వస్తుంది) అని మొఘులులు గ్రహించలేక పోయారు. క్రమేపీ, ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీ, తతిమ్మా ఐరోపావాసుల్ని, నయానా, భయానా తరిమివేసి, యుద్ధాల్లో ఓడించడం ద్వారా కూడా తమ ప్రాభవాన్ని నిలుపుకోడాన్ని ఎత్తులపై ఎత్తులు వేస్తూ, తదనుగుణమైన విధానాలు రూపొందించుకొన్నారు.

ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీలో కిందిస్థాయి గుమస్తాగిరి చేయడానికి వచ్చిన రాబర్ట్ క్లైవ్, ఉద్యోగరీత్యా, తక్కువ స్థాయిలో వున్నా, అత్యంత సాహసికుడుగా పేరు తెచ్చుకున్నాడు. డూప్లే నాయకత్వంలో దక్షిణాన ఫ్రెంచి సైన్యాలను ఓడించడంలో క్లైవ్ ముఖ్యపాత్ర వహించాడు. విజయం సాధించి ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని నెలకొల్పాడు. కానీ, దేశంలో ప్రాదేశికంగా, తీర ప్రాంతాల్లోని రేవు పట్టణాలు మినహా, ఆంగ్లేయులు కావాలనుకోలేదు. వారి దృష్టి బెంగాల్ రాష్ట్రంపై ఉంది. భౌగోళికంగా విశాలమైంది. సారవంతమైంది కూడా. అందుకే అత్యంత సంపన్న ప్రాంతంగా పేర్గాంచింది. నామ మాత్రంగానే మొఘలు చక్రవర్తికి లోబడి వున్నా, దాదాపు స్వతంత్ర రాజ్యంగా వ్యవహరిస్తోంది. బెంగాల్ నవాబు సిరాజుద్దౌలా మంచివాడే కానీ అసమర్థుడు, విలాస వంతుడు, తన ఎదుట , రాజ్యాస్థానంలో జరిగే రహస్య ద్రోహపూరిత కుట్రలను పసిగట్టి, నివారించే సామర్థ్యం లేనివాడు. అయినా ఆంగ్లేయులకు లొంగని స్వతంత్రుడు.

రాబర్ట్ క్లైవ్ ఇదంతా దక్షిణ భారతదేశం నుండి గమనించి, సమయం కోసం గుంటనక్కలా వేచి చూశాడు. కలకత్తాలో తమ వర్తక స్థావరాలను పటిష్టపర్చుకొనే విషయంలో ఆంగ్లేయులు, పోర్టు విలియంను మరింత పదిలం చేసుకున్నారు. దాని రక్షణ కోసం సైనికశక్తిని పెంచుకున్నారు. నవాబు సిరాజుద్దౌలా దీనికి అంగీకరించ లేదు. వర్తక, వాణిజ్యాలకే పరిమితం కావాలన్న షరతునే గట్టిగా అమలుపర్చాడు. ఆంగ్లే యులు దీన్ని పెడచెవిన పెట్టారు. దాంతో సైన్యంతో వారిపై దండెత్తి, ఓడించి ఫోర్ట్ విలియంను ఆక్రమించాడు. కానీ సైనిక విజయాన్ని సుసంఘటితం చేసుకోకుండా, తీరుబాటుగా, విలాసాల్లో తేలియాడాడు. దీన్ని, ఆంగ్లేయులు అవకాశంగా తీసుకొని తమ కుట్ర, కుహ కాలను వేగవంతం చేశారు. నవాబు వ్యతిరేకులను చేరదీశారు. ప్రోత్స హించారు. ముఖ్యంగా సిరాజుద్దౌలా ఆస్థానంలోని మంత్రి మీర్జాఫర్‌ను లొంగ దీసుకున్నారు. భారీగా డబ్బు ముట్ట చెప్పారు. దీంతో వారి కార్యం సగం పూర్తయింది. ఇక సైనిక చర్యకు సన్నాహాలు చేశారు. మదరాసు నుండి, క్లైవ్, అడ్మిరల్ వాట్సన్ నాయకత్వంలో, సైనిక నౌకా దళాలను కలకత్తాకు పంపారు. కంపెనీకి జరిగిన నష్టానికి పరిహారం చెల్లిం చాల్సిందిగా నవాబుకు అల్టిమేటం పంపారు. ఉపసంహ రించిన రాయితీలను తిరిగి ఇమ్మని డిమాండ్ చేశారు. అల్టిమేటమ్ కేవలం పేరుకు మాత్రమే. ఎలాగైనా యుద్ధం చేయాలన్న నిర్ణయం ముందే తీసుకొన్నారు. ఎలాంటి వ్యతిరేకత ప్రతిఘటన లేకుండా సిరాజుద్దౌలా సైనికులు లొంగి పోయారు. ఆ తర్వాత నవాబు ఫ్రెంచి వారితో సంప్రదింపులు జరుపుతున్నాడని తెలిసి, ఇక ఉపేక్షించి లాభం లేదను కున్నారు. ద్రోహచిం తనతో, మంత్రి మీర్జాఫర్‌ను లోపాయికారిగా, తమవైపు తిప్పు కున్నారు. అంతిమంగా, సిరాజుద్దౌలాయే 1757లో ప్లాసీ యుద్ధంలో (జూన్ నెల 23న భాగీరథినది ఒడ్డున వున్న మామిడితోపు వద్ద గల ప్లాసీ అనే చోట) ఓడించి మీర్జాఫర్‌ను బెంగాల్‌కు సుబేదార్‌గా ప్రకటించారు. మీర్జాఫర్‌ను ఆంగ్లేయుల చేతిలో కీలుబొమ్మ చేసుకొని క్లైవ్ బెంగాల్లో , ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని సాధించాడు. క్లైవ్ ఫోర్జరీలతో, ధనాశ చూపించి, కపటోపయాలతో, విభజించి, పాలించు విధానాలతో భారతదేశంలో ఆంగ్ల సామ్రాజ్యానికి బెంగాల్ విజయం ద్వారా పునాదులు నిర్మించాడు. మీర్జాఫర్ చర్య చరిత్రలో పెద్ద నమ్మక ద్రోహంగా నిలిచి పోయింది. క్లైవ్ బెంగాల్‌ను కంపెనీ అవసరాలకేగాక, వ్యక్తిగత లబ్ధికోసం దోచు కున్నాడు. లక్షలాది రూపాయల ధనాన్ని, అపారమైన బంగారు నిల్వల్ని కొల్లగొట్టుకొని ఇంగ్లండ్‌కు తీసుకు పోయాడు. అతడి చర్యలను బ్రిటీష్ పార్లమెంట్ నిరసించి, అభిశంసించింది. క్లైవ్ ఆత్మహత్య చేసుకున్నాడు. ప్లాసీ యుద్ధం, సైనిక ప్రమాణాల రీత్యా, ఎంతో చిన్న యుద్ధం కానీ, దాని ఫలితాలు మాత్రం గొప్ప యుద్ధాల కంటే ఎక్కువైనవి.

సిరాజుద్దౌలా



రాబర్ట్ క్లయివ్

జి.ఎల్.నరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

కొడుకు చూడటం లేదు

నాకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. నా భర్త గవర్నమెంటు ఉద్యోగం చేస్తూ మరణించారు. వారి వారసత్వంగా ఉద్యోగం నా పెద్ద కుమారునికి ఇవ్వడానికి నేను, మిగిలిన కుటుంబ సభ్యులం అంగీకరించాం. నా కుమారుడు మమ్మల్ని పోషించటానికి అంగీకరించాడు. కాని అతను ఇప్పుడు మమ్మల్ని చూడడంలేదు. ఇంకా పెళ్లి కావల్సిన ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఈ విషయం మా కుమారుడి పై అధికారులకు తెలిపిన వెంటనే అధికారులు సాక్షుల సమక్షంలో మాకు కొంత సొమ్ము ప్రతి నెలా జీతం నుండి పంపుటకు అంగీకార పత్రం రాసి ఇచ్చాడు. గత కొద్ది నెలల నుండి మళ్లీ ఇబ్బందులు పెడుతున్నారు. మాకు న్యాయం జరగాలంటే ఏమి చేయాలి ?

ఓ అభాగ్యురాలు.,విశాఖపట్నం.

మీ అబ్బాయి ఉద్యోగం తన తండ్రికి వారసుడైనందున పొందినది కావున కుటుంబ సంక్షేమం బాధ్యతలు విస్మరించకూడదు. మీరు ఒకసారి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కావున మళ్లీ వారినే సంప్రదించండి. పరిస్థితి చక్కబడుతుంది. లేదంటే సివిల్ దావా, కూడా వేసుకోవచ్చును.

అప్పీలు తీర్పు చూడండి

మా అన్నయ్యకు 29 సం॥లో మానసిక జబ్బు చేసింది. 17.3.2000న ఎర్రగడ్డ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించాం. అప్పుడప్పుడు సం॥రానికి ఒకటి రెండు మార్లు మతిస్థిమితంగా లేకుండా ప్రవర్తిస్తూ మా అమ్మా, నాన్నలపై దాడి చేసేవాడు. ఒక రోజు 20.2.2002న మా ఊర్లో మా నాన్నగారి పెదనాన్నపై దాడి చేశారు. అదే రోజు అతను మరణించాడు. అయితే మరణించిన వ్యక్తి కొడుకు మా మీద పాత కక్షలతో మా అమ్మానాన్న మీద 302,307 సెక్షన్ కింద కేసు పెట్టారు. అతని మానసిక పరిస్థితి బాగలేదని నిరూపించినా మా అన్నయ్యకు జీవిత ఖైదీ పడింది. మేమిప్పుడు హైకోర్టులో అప్పీలు చేశాము. మాకు న్యాయ సలహా ఇవ్వగలరు.

బి. శోభన్ బాబు, నల్గొండ .

మీ అన్నయ్య గారికి మతి స్థిమితం లేదనేది ప్రభుత్వ వైద్యులు కోర్టువారి అనుమతితో ధృవీకరించాల్సి ఉంటుంది. అలా జరిగి ఉంటే, మానసిక వైద్యులు ఏమి నిర్ధారించారో తెలుపలేదు. మతి స్థిమితం లేక అలా చేసినట్లు ఋజువైతే హైకోర్టు వారు విడుదల చేసే అవకాశం ఉన్నది. ఈ పాటికే అప్పీలు చేశారు కావున తీర్పు వరకు వేచి చూడాల్సిందే.

తప్పదు మరి ?



'మా అమ్మాయికి సిజేరియన్ చేయక తప్పదా డాక్టర్" ఆందోళనగా అడిగాడు అప్పారావు పురిటినొప్పులు పడుతున్న కూతుర్ని చూస్తూ

"తప్పదు మరి లేకుంటే నార్మల్ డెలివరి అయిపోయేలా ఉంది" అని నాలుక కరుచుకున్నాడు డాక్టర్.

- పెండెం జగదీశ్వర్

ఇంట్లో తల్లిదండ్రులు, కొడుకూ కోడలు, పిల్లలు... వీరంతా విభిన్న అభిరుచులూ అభిప్రాయాలు కలిగి ఉంటారు. తినేతిండి మొదలుకొని కట్టుకునే బట్టలే కాకుండా వారు నిర్వహించే పనుల్లోనూ చాలా వ్యత్యాసాలుంటాయి. ఒకరి అభిరుచులను మరొకరు అర్థంచేసుకోవాలి, ఆదరించాలి.

పి. జ్యోతి

అరవకండి... అర్థం చేసుకోండిలా ...!

ఇంట్లోని వారందరి అభిరుచులూ ఒకే విధంగా ఉండవు. నచ్చని అంశాలను పదే పదే ఎత్తిచూపడం... ఒకరిపై మరొకరు విమర్శలు గుప్పించుకోవడం కన్నా ఒకరి అభిప్రాయాలను మరొకరు ఆదరిస్తూ, గౌరవిస్తూ సహకరించుకుంటే...కుటుంబంలోని ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండగలుగుతారు కదా.

ఆమె ఓ సాధారణ గృహిణి. పాటలంటే ప్రాణం. వచ్చీరాని రాగంతో ఏదోకటి పాడుతూ ఉంటుంది. ఆమె పాటందుకోగానే...

"చాల్లే! గులకరాళ్లు డబ్బాలో వేసి ఊపుతున్నట్లుంది. పిల్లలు వింటే జడుసుకుంటారు ఇకాపు" అని భర్త అన్నాడే అనుకోండి. అంతే! ఇక ఆమె పాటలజోలికి పోవాలంటేనే భయపడుతుంది.

ఈ విషయాన్నే అతను "అబ్బ! నీ గొంతెంత స్వీట్‌గా ఉందోయ్... బాగా ప్రాక్టీసు చేస్తే ఎంచక్కా సిన్మాల్లో పాడెయ్యొచ్చు" అని ప్రోత్సాహకరంగా మాట్లాడితే ఆమె ఇంకా బాగా పాడేందుకు ప్రయత్నిస్తుంది కదా.

మరొకావిడకు రచనలు చేయడం ఇష్టం. తను రాసిన కథను భర్తకు చూపించిందావిడ.

దాన్ని చూసిన అతను "అ,ఆలే సరిగ్గా రాయడం రాదు. రచనలు చేయడానికి బయల్దేరిందండి" అని ఆమెను హేళన చేశాడనుకోండి. ఆమె మనసెంత నిరుత్సాహపడుతుందో... అదే ఆమె ఏం రాసినా అతను "అబ్బ! ఎంత బాగా రాశావోయ్" అని అన్నాడనుకోండి ఆమె ఇంకా బాగా రాయడానికి ప్రయత్నిస్తుంది.

ఇంకొకరింట్లో ఒకావిడకి పూజలంటే చాలా ఇష్టం. ఆమె భర్తకు ఇది నచ్చక "ఏంటా పూజలు... ఏడీ నీ దేవుడు...కనిపించాడా...వచ్చి కొబ్బరికాయెందుకు తినలేదు..." అంటూ యక్ష ప్రశ్నలేసి బాధపెట్టడమెందుకు?

"కొబ్బరికాయ కొడితే కొట్టావ్ ఎంచక్కా దాన్ని పచ్చడిచేసేయ్...మేమన్నా తినేస్తాం" అని అంటే సరిపోతుంది.

ఆస్తులు మూల్గుతున్నాయా...

పేదవిద్యార్థులకు ధన సహాయం చేశాడో భర్త.

"మనకేవన్నా మీ తాతముత్తాతలు సంపాదించిన ఆస్తులు మూల్గుతున్నాయా... ఓ... తెగ దానాలు చేసేస్తున్నారు" అంటూ భార్య అతణ్ని ఎగతాళి చేస్తే అప్పుడతని మనసెంత బాధపడుతుందో చెప్పలేం.

"ఉన్న దాంట్లో కాస్తో కూస్తో సహాయం చేయడం తప్పు కాదు. కానీ దానమిచ్చేటప్పుడు మన పరిస్థితినీ కొద్దిగా గుర్తుంచుకుంటే బాగుంటుందేమో ఆలోచించండి" అని అంటే అతనూ ఈ విషయాన్ని ఆలోచించడానికి అవకాశమిచ్చినట్టేకదా.

ఇంకొకతనికి స్నేహితులతో గడపడమంటే ఇష్టం. అప్పుడప్పుడూ స్నేహితులతో మనసుకు నచ్చే ఆటలేవో ఆడుతున్నాడనుకోండి. దీన్ని తీవ్రంగా తీసుకుని "అతని భార్య ఎప్పుడూ ఫ్రెండ్సే... ఇంటి ధ్యాసలేకుండా... అలాంటప్పుడు నన్నెందుకు కట్టుకున్నారు" అంటూ అతన్ని మాటలతో బాధపెట్టేస్తే ఏం లాభం.

"భిన్నత్వంలో ఏకత్వం" మొదట ఒక ఇంటి నుండే మొదలవ్వాలి. ఎలాగంటే... ఇంట్లో తల్లిదండ్రులు, కొడుకూ కోడలు, పిల్లలు... వీరంతా విభిన్న అభిరుచులూ అభిప్రాయాలు కలిగి ఉంటారు. తినేతిండి మొదలుకొని కట్టుకునే బట్టలే కాకుండా వారు నిర్వహించే పనుల్లోనూ చాలా వ్యత్యాసాలుంటాయి. ఇహ ఆహారం విషయానికొస్తే ఒకరికి పులుపు, మరొకరికి తీపి, ఇంకొకరికి కారం తినడమంటే ఇష్టం. మరిలాంటప్పుడు ఇంట్లో అన్ని రకాలుగా చేయడం కుదురుతుందా. కుదరదు. కాబట్టి ఏదో ఒకటి చేసుకుని అదే అందరూ ఇష్టంగా తినాలి. ఒకరి అభిరుచులను మరొకరు అర్థంచేసుకోవాలి, ఆదరించాలి. వారిని ప్రోత్సహించాలి.

నేర్చుకుందాం...రా!

గ్లాస్ పై పెయింటింగ్

అగస్త్యరాజు లక్ష్మి సూర్యకళ
ఫోన్ : 040-55889954

ఈ వారం గ్లాస్ మీద పెయింటింగ్ ఎలా చేయాలో చూద్దామా ! ప్రతి ఒక్కరి ఇంట్లో దేవుడు ఫొటోలు, పాత ఫొటోలు ఉంటాయి కదా ! అవి పాడై పోయినపుడు తీసి అవతల పడేస్తారు. అలా కాకుండా ఫ్రేమ్ నుండి గ్లాస్‌ను జాగ్రత్తగా విడిగా తీసి దాని మీద పెయింటింగ్ చేసుకోవచ్చు. లేదా ఫొటో ఫ్రేమ్ కట్టే చోట గ్లాసులు మనకు కావలసిన పొడవు, వెడల్పులలో దొరుకుతాయి. గ్లాసు మీద వేసుకునే పెయింటింగ్స్ ప్రత్యేకంగా ఉంటాయి. అవి షాపులలో దొరుకుతాయి. ఈ పెయింటింగ్స్‌తో గ్లాసుమీద పువ్వుల నుగానీ, ఏదన్నా సీనరీస్ గానీ, లేదా పల్లకిలో పెళ్లి కూతురు బొమ్మగానీ అదీ కాదంటే జింకలు, వగైరా మనం మెచ్చిన బొమ్మను పెయింటు చేసి ఫ్రేమ్ కట్టించి గోడకు వేస్తే ఇంటికి వచ్చిన వాళ్ల కళ్లు అటు తిరక్కమానవు. ఈ గ్లాసు పెయింట్ చేసేటప్పుడు కార్నర్స్ కోసుకునే ప్రమాద ముంటుంది. జాగ్రత్త సుమీ.

ఇక దీనికి కావలసినవేమిటో చూద్దామా !

1. గ్లాస్ 30×24 సైజు
2. గ్లాస్ పెయింటింగ్స్ మరియు అవుట్ లైనర్ (ట్యూబ్)
3. మనకు నచ్చిన డిజైను



పెయింటింగ్ చేసే విధానం

ముందుగా గ్లాసును సబ్బు నీళ్ళతో లేదా వెనిగర్ లేదా ఆల్కహాల్‌తో శుభ్రంగా కడగాలి. తడి ఆరిన తర్వాత మనం ఏ డిజైన్ అయితే గీయాలనీ అనుకుంటున్నామో ఆ డిజైన్ కాగితాన్ని గ్లాసుకు అడుగున పెడితే డిజైన్ పైకి కనిపిస్తుంది కదా ! అప్పుడు అవుట్ లైనర్‌తో మధ్య ఖాళీ లేకుండా అవుట్ లైన్ వేసుకోవాలి. లేకపోతే రంగు బయటికి కారిపోతుంది. అవుట్ లైన్ వేసిన తర్వాత ఆ గ్లాసు కలర్స్‌తో ఎక్కడ ఏ రంగు రావాలో అక్కడల్లా బ్రష్‌తో డ్రాప్స్, డాప్స్‌గా వేసుకోవాలి. అంతేగాని పూయకూడదు. ఇలా రంగులు వేసిన తర్వాత దాన్ని దుమ్ము పడకుండా 24 గంటలు ఆరనివ్వాలి. ఎండలో ఆరపెట్టకూడదు. ఇలా ఆరిన తర్వాత పెయింట్ చేసిన వైపు అడుగున ఉండేటట్లు ఫ్రేమ్స్ కట్టించాలి. ఈ గ్లాసు పెయింటింగ్స్ ఖర్చు ఎక్కువ అనుకుంటే ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌తోనూ పెయింటింగ్ చేసుకోవచ్చు. +

పీకకు - పీకాక్

ఒక స్కూల్‌ను ఇన్‌స్పెక్షన్ చేయడానికి డీఈఓ వచ్చారు. ఆరో తరగతిలో పిల్లల్ని ప్రశ్నలడుగుతున్నాడు

నాలుగో వరుసలో పొడుగ్గా జుట్టు పెంచుకున్న ఓ కుర్రాడిని లేపి "నెమలిని ఇంగ్లీషులో ఏమంటారు చెప్పు" అనడిగాడు. జవాబు తెలియని ఆ కుర్రాడు దిక్కులు చూడసాగాడు. ఇంతలో అతని వెనకాలే కూర్చున్న కొంటె కుర్రాడొకడు అతని జుట్టు పట్టి లాగాడు. దానికతడు కోపంగా "పీకకు" అన్నాడు.

వెరిగుడ్ బాగా చెప్పావు. కూర్చో అన్నాడా డీఈవో మెచ్చుకోలుగా (నెమలిని ఇంగ్లీషులో "పీకాక్" అంటారు కదా !)

- పెండెం జగదీశ్వర్

సీరియల్

మాధవి

మూలం : అనుపమా నిరంజన

అనుసరణ : వి. నాగరత్న

గతవారం కథలో...

పుత్ర సంతానం కోసం పుత్రకామేష్టియాగం, రాజ్యవిస్తరణ కోసం అశ్వమేథయాగం ఏర్పాట్లలో ఉన్న కాశీరాజు దివోదాసు వద్దకు గాలవుడు మాధవిని తీసుకెళ్లాడు. ఆయన వద్దా గాలవుడి గురుదక్షిణకు పనికొవచ్చే గుర్రాలు కేవలం రెండొందలే ఉండటంతో అంతకు ముందు రాజువద్ద బేరంలాగే ఒక సంవత్సరం కాపురం చేసి మొగపిల్లాణ్ణి కనిచ్చేందుకు మాధవిని అప్పగిస్తాడు. వివాహమాడనిదే ఏ పరస్త్రీనీ తాకననే "నిష్ట"గల దివోదాసు మాధవిని పరిణయమాడాడు.

(16వ భాగం)

మాధవితో పాణిగ్రహణం అయిన రెండోరోజు దివోదాసు మహారాణి సత్యవతి మందిరానికి వెళ్లాడు.

సత్యవతికి అప్పటికే చెలికత్తెల ద్వారా విషయం తెలిసి కోపంగా వుంది. 'రాజును తానెంత అలరించినా సరే ఏదో సందర్భంలో ఎవరో ఒకర్ని పెళ్లాడుతూనే ఉంటాడు. కనీసం ఫలానావారిపై మనసు కలిగింది, చేసుకోవాలనుకుంటున్నాను అని మాటమాత్రంగానైనా చెప్పడు. గతమెందుకు తవ్వుకోవడం? నిన్న మట్టుకు నిన్న ఎవరో గొప్ప అందగత్తెను భార్యగా స్వీకరించాడట. ముందుగా చెప్పని మాట అటుంచి ఇప్పుడైనా చెప్తాడేమో చూడు... అబ్బే, ఏమీ జరగనట్లు ఎంత యథాలాపంగా ఉన్నాడు?!' అని పళ్లు నూరుకుంది.

"ఏం సత్యా, ఏమీ మాట్లాడవే? ఒంట్లో ఏమైనా నలతగా ఉందా?" అన్నాడు దివోదాసు.

"మనసుకే సుస్తీ చేసింది. తమరు మరో పెళ్లి చేసుకున్నారని విన్నాను. ఇదేమైనా న్యాయంగా ఉందా?"

'అప్పుడే చేరవేశారన్నమాట ఈ చెలికత్తెలు, వీళ్లు మరీ నారదమునిలా తయారయ్యారు. అయినా ఎప్పటికైనా తెలియకుండా ఉండదుగా' అని ఒక క్షణం ఏం చెప్పాలో నిర్ణయించుకుని ముందుగా సత్యవతిని గాఢంగా ఆలింగనం చేసుకుని కోపతీవ్రత తగ్గేలా చేశాడు. ఆనక చెంపలను నిమురుతూ "దేవీ, నువ్వంటే నాకెంత మక్కువో వేరే చెప్పనక్కర్లేదుగా. అది తెలిసీ నన్నిలా నిలదీయడం బాగుందా?" అన్నాడు.

"అయితే నా మాట నిజం కాదా?" ఉక్రోషంగా అడిగింది. అది అబద్ధమని అతడంటే బాగుండునని తహతహలాడింది.

దివోదాసు గాలవుని ఇతివృత్తాన్ని రెండుముక్కల్లో చెప్పి "బ్రాహ్మణుడు వచ్చి కన్యాదానం చేస్తానంటే రాజునైన నేను వద్దనడం ఏమైనా భావ్యంగా ఉంటుందా నువ్వే చెప్పు" అన్నాడు.

'ఇందులో భావ్యం కానిదేముంది? నాకు నా రాణి అంటేనే తగని ఇష్టం, మరెవరిమీదా ధ్యాసలేదు అంటే ఇంకెంత భేషుగ్గా ఉంటుంది? బహుభార్యా లోలుడు కావడం కంటే ఏకపత్నీవ్రతుడిగా మిగలడం గొప్ప సంగతి' అనాలనిపించినా రాజుకు కోపం తెప్పించడం ఇష్టంలేక మౌనంగా ఉండిపోయింది.

రాజు మళ్లీ అందుకుని "అయినా మాధవి ఇతర రాణివాసపు స్త్రీలలా ఎప్పటికీ ఇక్కడే ఉండిపోదు. ఆమెకో కొడుకు పుట్టేవరకూ మాత్రమే ఇక్కడుంటుంది" అన్నాడు.

ఆ మాటతో సత్యవతికి సగం గుండెభారం తీరినట్లయింది. మాధవి

"నల్లరంగు చెవి ఉన్న తెల్లటి గుర్రాలు ఎనిమిది వందలు నాకు గురుదక్షిణగా కావాలి" అన్న గురువు గారి కోరికను ఆ శిష్యుడెలా తీర్చాడో ఈ సీరియల్‌లో చదువుతున్నారు.

లోకోత్తరంగా ఉందని విన్నప్పట్నించీ రాజు తనకు దూరమై ఆమెకు చేరువౌతాడేమోనని బెంగ పట్టుకుంది. కొంతకాలం ఉండి వెళ్లిపోతుందనగానే ఊపిరి పీల్చుకుని "ఇంతకీ ఆ అమ్మాయెలా ఉంది?" అనడిగింది ఏమీ తెలీనట్లు.

'అపురూప సౌందర్యరాశి అని చెప్తే నువ్వు భరించగలవా?' అని మనసులో అనుకుని పైకి నాలుక చప్పరిస్తూ "ఆ ఏదో ఉంటుంది. నీ ముందు బొత్తిగా తేలిపోతుంది" అన్నాడు.

దాంతో సత్యవతి పొంగిపోతూ ''అయితే బిడ్డ పుట్టగానే వెళ్లిపోతుందన్నమాట. అయినా ఇదేం లెక్క?" అంది.

రాజు మాట తప్పిస్తూ "అవన్నీ ఇప్పుడెందుకులే సత్యా" అంటూ ఆమెని దగ్గరికి తీసుకున్నాడు.

'మాధవి బిడ్డతో సహా వెళ్తుందా? కొడుకు పుడితే మట్టుకు ఈయన ఇచ్చేందుకు ఒప్పుకోడు. బహుశా కొడుక్కోసమే ఆమెని చేసుకుని ఉండాలి. సరే పుట్టనీ తనకెటూ పిల్లల్లేరు కనుక తానే పెంచుకుంటుంది. ఒకవేళ ఈలోపు తనకూ బిడ్డ పుడితే ఇద్దర్నీ పెంచుకోవచ్చు... బరువౌతారా?!' అనుకుంది రాణీ చాలా ఉదారంగా.

-- -- --

అశ్వమేథయాగం భారీగా నిర్వహించాడు దివోదాసు.

సామంతరాజులతోబాటు ఆయా దేశాలనుండి ప్రతినిధులొచ్చారు. ఇక చుట్టుపక్కల గ్రామాలనుండే కాక దేశం నలుమూలలనుండి ప్రజలు తరలివచ్చారు. ఆ యాగాన్ని చూడటం పుణ్యకార్యంగా భావిస్తారు మరి. మహారాణి సత్యవతి, ఇతర రాణివాసపు స్త్రీలతోబాటు మాధవి కూడా వచ్చి తనకు కేటాయించిన ప్రదేశంలో కూర్చుంది.

జలచరాలు, భూచరాలు అనే భేదం లేకుండా మూడొందల రకాల జీవులతోబాటు అశ్వమేథయాగపు గుర్రం కూడా బలిపశువులయ్యాయి. వేలాదిమంది ఆహూతులకు భోజనవసతులు కల్పించారు.

భరద్వాజుడి ఆజ్ఞమేరకు మహారాణి వెళ్లి అశ్వాన్ని పూజించి తర్వాత దానికి కత్తితో గాట్లు పెట్టింది.

చివరగా ఋత్విక్కు అశ్వరత్నపు వపను తీసి శాస్త్రబద్ధంగా పచనం చేశాడు. వపను వేయిస్తున్నపుడు రాజు శాస్త్రరీతిలో ఆ పొగను ఆఘ్రాణించాడు. చనిపోయిన ఆ గుర్రపు శరీరభాగాలను అగ్నిలో వేయించారు. అదంతా చూస్తున్న మాధవికి తెమిలినట్లయింది.

కార్యక్రమం అంతా నిర్విఘ్నంగా పూర్తయ్యాక "రాజా, ఇప్పుడు భూదానం చెయ్యి. దానంవల్ల నీ వంశం వృద్ధి చెందుతుంది" అన్నాడు భరద్వాజ మహర్షి.

దివోదాసు తన సామ్రాజ్యంలోని కొన్ని చిన్నచిన్న రాజ్యాలను ఋత్విక్కులకు దానం చేశాడు.

యథాప్రకారం ఋత్విక్కులు "మహారాజా, వేదాలతో కాలక్షేపం చేసే మేం రాజ్యాన్ని ఏం చేసుకుంటాం?! వాటిని మీరే కొనుక్కోండి" అంటూ దానం తీసుకున్న భూమికి బదులుగా ఆవులను, బంగారు నాణాలను పుచ్చుకుని తీసుకున్న రాజ్యాలను తిరిగి రాజుకే అప్పగించారు.

ఆ తర్వాత పుత్రకామేష్ఠి మొదలైంది. ఋత్విక్కులు సామవేదాన్ని గానంచేశారు.

"రాజా, యజ్ఞకుండం నుండి ఉద్భవించిన పురుషాకృతిని చూడు.. ఆహా, ఎంత కాంతివంతంగా వుంది?!" అన్నారు భరద్వాజులవారు హెచ్చుస్వరంతో గంభీరంగా.

దివోదాసు ఉలిక్కిపడి మంటలను తదేకంగా చూశాడు. కానీ అందులో ఆయనకి ఏ ఆకారమూ కనిపించలేదు.

కానీ భరద్వాజుడు మాత్రం "చూశావా రాజా? ఏం తేజస్సు? ఆ అనుపమానమైన సౌందర్యాన్ని కన్నార్పకుండా చూడాలనిపించడంలేదూ?!" అంటూ మొదలుపెట్టి ఆ ఆకారాన్ని గొప్పగా వర్ణించి అది రాజుకు పుట్టబోయే సంతానానికి సంకేతమంటూ దానికి నమస్కారం చేయమని చెప్పాడు.

కానీ రాజు ఎంత ప్రయత్నించినా ఏ ఆకృతీ కనిపించలేదు. దుఃఖం ముంచుకొచ్చింది. 'భరద్వాజుడంటే పుణ్యపురుషుడు కనుక ఆ మహాపురుషుణ్ని చూడగలిగాడు. యుద్ధసమయాల్లో ఎందర్నో చంపిన తనకెలా కనిపిస్తాడు? దాన్ని చూడలేకపోతే తనకు కొడుకు పుట్టడా ఏమిటి?' అని భయపడ్డాడు. అలాని తనకు కనిపించలేదని నలుగురిమధ్యా చెప్పడం అవమానంగా అన్పించి తనకూ కనిపిస్తున్నట్లుగా సంతోషాన్ని అభినయించి నమస్కరించాడు.

భరద్వాజుడు మళ్లీ అందుకుని "యజ్ఞకుండం ముందు నైవేద్యంగా పెట్టిన బంగారు కలశంలోని పాయసాన్ని దేవతలకు సమర్పించాను. సకల దేవతలూ ఆశీర్వదించి ఇచ్చిన ఈ పాయసాన్ని రాణీకి ప్రసాదంగా ఇవ్వు రాజా" అన్నాడు.

దివోదాసు భక్తిశ్రద్ధలతో పాయస కలశాన్ని అందుకున్నాడు.

సత్యవతి మెల్లగా వెళ్ళి పాత్రను అందుకుని కళ్లకు అద్దుకుని జారుగా వున్న పాయసాన్ని ఎత్తి నోట్లో పోసుకోసాగింది.

చూడబోతే అంతా ఆవిడే తాగేసేలా ఉందనుకుని "తక్కిన రాణులకు ఇవ్వు రాజా" అన్నాడు భరద్వాజుడు.

'అంటే కేవలం సత్యవతికే గాక ఎవరివల్లనైనా కొడుకు పుట్టవచ్చున్నమాట' అనుకుని దివోదాసు కంగారుగా "సత్యా, సత్యా... తాగింది చాలు తక్కింది ఇవ్వు" అన్నాడు.

అప్పటికే చాలాభాగం అయిపోగా మిగిలింది చేతులు మారుతూ ఒక్కో రాణీ వద్దకూ చేరింది కలశం. క్రమేపీ పాయసం తగ్గుతూ వచ్చి కొందరు రాణులకు ఒక్కో చుక్క మాత్రమే దక్కింది.

దివోదాసు ఉన్నచోటునే ఉన్నాడు కానీ కళ్లన్నీ ఆ ప్రసాదపు పాత్రపైనే నిలిచాయి. దాన్ని, మాధవిని మార్చిమార్చి చూస్తున్నాడు. పట్టమహిషి కనుక మొదట సత్యవతికి అందించాడు కానీ నిజానికి మాధవికి ఇవ్వాలని ఆయన మనసు తెగలాగింది. 'సామ్రాట్టు కాగల పుత్రుణ్ని కంటుంది' అంటూ మాధవి గురించి గాలవుడు చెప్పిన మాట దివోదాసు మర్చిపోలేదు. ఈ సౌందర్యరాశి ద్వారా కొడుకు కలగడం కంటే కావలసింది ఇంకేముంది? అనుకున్నాడు.

ప్రసాదం చూస్తే కాస్తే ఉంది. ఒకరా ఇద్దరా అనేకమంది రాణులాయె. ఇన్ని లక్షల వరహాలు ఖర్చుపెట్టి వేలమందికి సంతర్పణ చేస్తుండగా ప్రసాదం విషయంలో ఇంత అలసత్వమా? పాలకో, బెల్లానికో లోటైనట్టు ఇంత తక్కువ పాయసం చేయించారేం? అక్కడ ఇతర రాజులు, మహర్షులు ఉండబట్టి సరిపోయింది కానీ లేకుంటే నిర్వహణాధికారులను దులిపిపారేసేవాడే. రాజు కోపం తమాయించుకున్నాడు కానీ ఇక అది పూర్తిగా అయిపోతున్నకొద్దీ ఆరాటాన్ని అణచుకోలేక "మాధవికి.. మాధవికి.. కొంచెం మాధవికివ్వండి" అన్నాడు రాజు కంగారుగా.

సరిగ్గా అప్పుడే పాత్ర మాధవిచేతికి వచ్చింది.

కానీ అందులో చుక్క పాయసం కూడా మిగల్లేదు.

మాధవి ముఖంలో ఎలాంటి భావమూ ద్యోతకమవలేదు. మౌనంగా తిరిగిచ్చేసింది. కన్నకొడుకును వదులుకుని వచ్చిన మాధవికి పాత్రలో ప్రసాదం అయిపోవడమనే అల్పవిషయం ఒక లెక్కా?!

... ఇంకా ఉంది

మాధవికి యజ్ఞపాయసం మిగల్లేదు కదా...మరి కొడుకు పుడతాడా...లేదా?!

యజ్ఞహోమగుండంలో కనబడ్డ తేజోవంతమైన పురుషుడు ఏ రాణి కడుపున పుడతాడని మరి?

మాధవికి ఒకవేళ సంతానం కలిగినా వదిలేసి మళ్లీ ఇంకో చోటకు వెళ్లాలికదా...మరి ఆమె ఏం చేసింది?

వచ్చే సంచికలో ...

క్యాంపస్ ఛాట్

ఆయనా ఒక గురువుకు శిష్యుడే

మొన్నా మధ్యన మా క్లాస్‌మేట్ ఒకమ్మాయిది పుట్టిన రోజు. తను మా కాలేజీ క్యాంటీన్‌లో పార్టీ ఇస్తానంది. ఫ్రెండ్సందరమూ వెళ్లాం. కర్రీపఫ్స్, కూల్ డ్రింక్స్ ఆర్డరిచ్చాం. అవి రావడానికి టైం పడుతుంది. అందరం కబుర్లలో పడ్డాం. ఒకమ్మాయి టీచర్స్ గురించి మాట్లాడ్డం మొదలు పెట్టింది. వాళ్లకు తెలిసిన ఒక హైస్కూల్ హెడ్‌మాస్టర్ ట్రాన్స్‌ఫర్ నిమిత్తమై వరంగల్‌లోని ఆర్.జె.డి. కార్యాలయానికి వెళ్లారు. ట్రాన్స్‌ఫర్ కౌన్సిలింగ్‌కి వచ్చిన తన స్నేహితులతో ఆయన మాట్లాడుతున్నారు. ఆ సమయంలో ఆ హెడ్‌మాస్టరును ఎవరో పిలిచారు.

ఆ పిలిచిందెవరో కాదు ! ఒక యువకుడు.. కౌన్సిలింగ్ మెంబర్లలో ఒకరు ! అంతేకాదు ఆయన వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి. ఆయనకు చిన్నప్పుడు సైన్సు, ఇంగ్లీషు బోధించిన వ్యక్తే ఆ హెడ్‌మాస్టరు. తన చిన్ననాటి గురువు కళ్ల ముందు కనిపించేసరికి ఆ శిష్యుని ఆనందమంతా ఇంతా కాదు. "ఆయన బోధించిన పాఠాల వల్లే నేనింత వాడినయ్యాను"అని ఆ శిష్యుడు ఆనందంతో అక్కడున్న వారందరికీ తెలియజేశారు. అప్పుడు " మనం ఇంజనీరింగ్ చదవవచ్చు. మరేదైనా చదవవచ్చు. అని మా ఫ్రెండ్సందరికీ అనిపించింది. మనకు పునాది వేసిన గురువులనూ, అందుకు వారు చేసిన కృషినీ మర్చిపోకూడదు" అని మేమంతా అనుకున్నాం. ఇలా మాట్లాడుతుండగానే మా ఆర్డర్ వచ్చింది. ఒక మంచి విషయాన్ని చర్చించామనే సంతోషం మాకు మిగిలింది.

- జె. శ్రావణి, ఆడమ్స్ ఇంజనీరింగ్ కాలేజి, పాల్వంచ

ఐ లైక్ నేచర్



ఇన్ని రోజుల నుండి గడిపిన లైఫ్ ఒక రకం.గా ఉంది. ఇప్పుడు గడుపుతున్న లైఫ్ దానికి వ్యతిరేకంగా ఉంది. నేను స్కూలుకెళ్లే రోజుల్లో... స్కూలు మా ఇంటికి దగ్గరగా ఉండేది. నేను మా ఫ్రెండ్స్‌తోకలిసి కబుర్లు చెప్పకుంటూ...నడుచుకుంటూ స్కూలుకెళ్లేదాన్ని. ఇప్పుడు కాలేజీ రోజులు... కాలేజీ మా ఇంటికి చాలా దూరం. రైల్లో వెళ్లాలి. ప్రతిరోజూ ఉరుకులు... పరుగులు. పొద్దున లేవగానే రైలెక్కడ మిస్సవుతుందోనని ఒకటే టెన్షన్.... "త్వరగా లేయ్యవే" అని అమ్మ పోరు. నేనేమో లేటుగా లేవడం. హడావిడిగా వెళ్ళడం. కాలేజీకి రెడీ అవుతున్నంత సేపూ ఇంట్లో ఓ యుద్ధం. కాకపోతే రైల్లో వెళ్లినంత సేపూ చాలా ఎంజాయ్ చేస్తా. స్నేహితులందరం ప్రతిరోజూ జోక్స్‌చెప్పకుంటూ వెళ్తాం. దారి పొడువునా ఎన్నో ప్రకృతి దృశ్యాలు కనిపిస్తూ కన్నుల విందు చేస్తాయి. దీనితో మార్నింగ్ పడిన టెన్షనంతా మటుమాయమైపోతుంది. నిజంగా ప్రకృతికెంత మహత్తుందో ! అందుకే నేను మా ఇంట్లో రకరకాల మొక్కలను పెంచుతాను. ఆ మొక్కల మధ్య కూర్చుని చదువుకుంటాను. దీని వలన మైండ్ ఫ్రెష్‌గా అవుతుంది. చదివింది త్వరగా బుర్రకెక్కుతుంది.. అందుకే ఐ లైక్ నేచర్ వెరీమచ్.

ప్రీతి ద్వివేదుల ఇంజనీరింగ్ విద్యార్థిని, శ్రీ కవిత ఇంజనీరింగ్ కాలేజ్, కారేపల్లి.

డియర్ ఫ్రెండ్స్ :

ఆదివారం అనుబంధం "స్నేహ"లో ఈ పేజీ మీదే.
ఈ పేజీలోకి మీ "క్యాంపస్ ఛాట్" ను మోసుకురండి. మీ కాలేజీ / క్లాస్‌రూమ్ అనుభవాలనూ, అనుభూతులనూ రాయండి. ఈ పేజీ మీద నుంచి అందరితో పంచుకోండి. మీ ఫొటో కూడా పంపండి.

- ఎడిటర్

ఆ రోజుల్లో వాళ్ళందరినీ చూసి, ఈ రోజున సినిమా పరిశ్రమను చూస్తే చాలా బాధాకరంగా ఉంది. రాజకీయ రంగానికి సినిమా పరిశ్రమకు చాలా దగ్గర పోలికలున్నాయి. రాజకీయ రంగంలో ఏం చేసైనా సరే గెలిచినవాడే రాజు. సినిమాల్లోనూ ఏం చేసైనా సరే, చాలా దగ్గర పోలికలున్నాయి. రాజకీయ రంగంలో ఏం చేసైనా సరే గెలిచినవాడే రాజు. అదే విధంగా సినిమాల్లో కూడా ఏం చేసైనా సరే, ప్రేక్షకుల బలహీనతలు కొల్లగొట్టయినా చిత్రాన్ని సక్సెస్ చేసినవాడే రాజు.

చందు

ఎవరి దారి వారిది... ఎవరి పరుగు వారిది...

పైన చెప్పానే ఆ సిద్ధాంతంలో నేను ఇమడలేక చాలా కష్టాలను ఎదుర్కొన్నాను. వేసిన అడుగు వెనక్కి తీసుకోలేక తిరిగి గూడూరు పోలేక అనేకమార్లు అనేక రకాలుగా కష్టాలను ఎదుర్కొన్నాను. అయినా ఆత్మ విశ్వాసం అన్నింటికంటే గొప్పదనే ఉద్దేశంతో ఇన్నాళ్లూ సినిమా పరిశ్రమనే నమ్ముకుని ఉన్నాను. కానీ ప్రస్తుతం ఇందులో కొనసాగడమనేది జరిగే పనికాదు. ఎందుకంటే ఒక సక్సెస్ వచ్చిన నిర్మాత గురించి ఎంతగా ఫీలవుతారో దెబ్బతిన్న తర్వాత ఎంత చులకనగా చూస్తారో నేనే ఉదాహరణ. ఈ రోజు కూడా గొప్ప గొప్ప కళాకారులున్నారు. కానీ ఈ దినం సినిమా పరిశ్రమ గర్వకారణంగా లేదు. ఎవరిదారి వారిది... ఎవరి పరుగు వారిది... 'బడ్జెట్‌తో నాకు సంబంధం లేదని చెప్పేవాడు ఎంత గొప్ప డైరెక్టర్ అయినా డైరెక్టర్‌గా నేను గుర్తించను. బడ్జెట్టే ముఖ్యమని' కె.వి. రెడ్డిగారు చెప్పేవారు. నా సినిమాకు అన్నీ ముందే బడ్జెట్ వేసుకునేవాళ్లం. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న జనాభా ఎంత? టిక్కెట్ ఎంత? ఎంతమంది చూస్తే ఎంత డబ్బు వస్తుంది. వంద రోజులాడితే ఎంత వస్తుంది? ఒక వేళ ఫెయిల్యూర్ అయితే ఎంత వస్తుంది? ఇవన్నీ లెక్కలు కట్టేవాళ్ళం. ఇప్పుడది లేదు. పరుగు పందెం ప్రారంభమైంది. ఇండస్ట్రీ ఎంత దారుణ పరిస్థితుల్లో ఉందో ఒకే ఉదాహరణ. చెంగల వెంకట్రావు అపరిమితమైన బడ్జెట్‌తో 'సమరసింహారెడ్డి' చిత్రాన్ని తీశారు. సెన్సేషనల్ హిట్ అయింది. ఆ నిర్మాత తదుపరి చిత్రంలో ఎంత మిగుల్చుకున్నాడు. ఎంత బాగుపడ్డాడంటే... ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చింది. దీనికి ఎవరు బాధ్యులు. నిర్మాత ఎంత బాధ్యుడో, నటీనటుల, సాంకేతిక నిపుణుల బాధ్యతా అంతే ఉంది.

ప్రజల నాలుకల మీద జీవించారు

ఈ రోజు మార్కెట్లో ఎవరు బాగుంటారో ఆ హీరో వెంట పడటం... ఎవరు సక్సెస్‌లో ఉంటే వారికి సన్మానం చేయడం... ఆచారంగా వస్తున్న రోజులివి. ఏ రంగలోని మనిషికైనా సక్సెస్ ప్రధానం కాదు. **'ఏ నటునికైనా ఎన్ని పాత్రలు తాను ధరించానన్నది కాదు'**. 350 చిత్రాల్లో చేశానంటారు. కానీ జనాల నాలుకపై కానీ, హృదయంలో కానీ స్థానం ఉండదు. ఎన్ని పాత్రలకు న్యాయం చేశారన్నదే ముఖ్యం. కవికీ ఈ మాట వర్తిస్తుంది. **'ఏ మహాకవికైనా ఎన్ని కావ్యంబులు రచించినాన్నది ప్రతిభ కాదు'**. నూరు పుస్తకాలు రాశానని చాలామంది చెబుతుంటారు. జనాలకు నచ్చిన మాటలు చెప్పి పుస్తకాలు ఎక్కువ రాసేసి ఎక్కువ సంపాదించుకోవడం కవికి ముఖ్యం కాదు. మొల్ల ఒక్కటే పుస్తకం రాశారు.



మన మధ్యలో ఇంకా జీవించే ఉన్నారు. వేమనగారు ఏమన్నా పుస్తకాలు అచ్చువేయించారా? ఆయన్నెవరు బతికించారు. ప్రజల నాలుకల మీద బతికాడు. వేమనను కవిత్వంలో ఆదర్శంగా తీసుకుంటారు. తరతరాల నుండి తరగని కీర్తితో ప్రజల నాలుకల మీద బతికివున్న ఆటవెలది కవికి అజ్ఞాత శిష్యుడిగా ఇది నా సిద్ధాంతం. అదే విధంగా ఏ నాయకునికైనా ఎన్నేళ్లు పదవిలో కొనసాగానన్నది కొలతకాదు. లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధానమంత్రిగా ఎన్నేళ్లు ఉన్నారు. కానీ ఈ రోజుకీ ఆయన్ని తలచుకుంటే హృదయం ద్రవించిపోతుంది. ఒక వ్యక్తి ఎన్నేళ్ళు జీవించాడన్నది ముఖ్యంకాదు. శంకరాచార్యులు, ఎన్నేళ్ళు జీవించారు. వివేకానందుడు ఎన్ని పుట్టిన రోజు పండుగలు చేసుకున్నాడు.

నేడు నిర్మాతకు స్వేచ్ఛ ఉందా?

ఆ రోజుల్లో రామారావుగారి దగ్గరికి వెళ్లి మీరు చెప్పిన డైలాగ్ నచ్చలేదని చెప్పగలిగాను. ఎస్వీ రంగారావుగారు తప్పు చెబితే మనం రాసుకున్నప్పుడు రంగారావుగారు పలికినంత ఇప్పుడు చెప్పలేదని దర్శకుడు కామేశ్వరరావుగారితో అంటే... 'అమ్మమ్మ అంతేనండీ. కానీ ఆయనకు మనం డైలాగ్ చెప్పగలమా' అన్నారు. ఇంతలో "ఏం రెడ్డీ... ఇటురా ... ఏంటీ గుసగుసలాడుతున్నావ్" అని రంగారావుగారు పిలిచారు. ఏం లేదు సార్ డైలాగ్ ఇంకోసారి చెబితే బాగుంటుందేమో అన్నాను. "ఆహా... ఎన్నేళ్లకి వచ్చావయ్యా మొగాడివి... నాకు డైలాగ్ నేర్పడానికి..." అన్నారు. అయ్యయ్యో మీకు డైలాగ్ నేర్పే శక్తి నాకుంటే ఆ వేషం నేనే వేసేవాణ్ని కదా సార్... డైలాగ్ నేర్పడం కాదు. మీ ఫేస్‌కి ఆడియన్స్‌లో ఒక విలువుంది. నేను రాసుకున్న డైలాగ్ మీ నోటివెంట వస్తుంటే ఏదో మిస్ అయిందనే భయం పట్టుకుందన్నాను. 'ఆహా... ఏదీ నువ్వు చెప్పు చూద్దాం... ' అన్నారు. చెప్పలేక కాదు సార్... చెప్పమంటారా అని మూడు పేజీల డైలాగ్‌ను ఒకేసారి చెప్పాను. అదే ఈ రోజు ఏ ప్రొడ్యూసర్ అయినా పోయి నీ డైలాగ్ బాగాలేదు. ఇలా కావాలని చెప్పగలిగిన స్థాయిగానీ, పరిస్థితిగానీ పరిశ్రమలో ఉందా? మ్యూజిక్ డైరెక్టర్‌ని పెట్టుకునే స్వేచ్ఛ ఉందా? తనకు కావలసిన విధంగా పాట రాయించుకోగలుగుతున్నాడా? ఈ 75 సంవత్సరాల కాలంలో ఎంతమంది నిర్మాతలొచ్చారు? ఈ రోజు ఎంతమంది బతికున్నారు? ఎన్ని కుటుంబాలు చల్లగా ఉన్నాయి? ఆర్టిస్టులు ఎంతమంది నష్టపోయారు? ఎంతమంది నిర్మాతలు పెట్టుబడి పెడితే ఒక ఆర్టిస్టు ఎదుగుతాడు. రామారావుగారైనా, నాగేశ్వరరావుగారైనా, కన్నడ కంఠీరవం రాజకుమార్‌గారైనా సెట్‌లోకి వస్తే సెట్‌ని దేవాలయంగా భావించి దండం పెట్టి లోపలకి వచ్చేవాళ్లు. రామారావుగారు ఒక ప్రొడ్యూసర్‌కి కాల్షీటిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంకొకరికి డేట్స్ ఇచ్చేవాళ్లు కాదు. విమర్శించడం కాదు కానీ ఈ రోజు ఆ పద్ధతుందా?

వచ్చేవారం ఇంకొన్ని వివరాలు

చిన్నారి చిత్రకారులు

బదే గణేష్ కుమార్,
7వ తరగతి,
సూర్యతేజ పబ్లిక్ స్కూల్,
పార్వతీపురం,
విజయనగరం.

జి.గౌరీశంకర్, 9వ తరగతి,
జడ్‌పిహెచ్ స్కూల్, రెడ్డివారిపల్లి,
సాదమ్.

పి.గీతాదేవి, 7వ తరగతి,
జిజిహెచ్ స్కూల్,
న్యూ మూసారామ్‌బాగ్,
సరూర్‌నగర్.



ఆ ఐదు తప్పలేవి?



చిన్నారులూ... కొంతమంది చాలా పెద్ద పెద్ద ఇళ్లల్లో వుంటారుకదా. అలాంటి వాళ్ల ఇళ్లల్లో బాత్‌రూమ్ ఇది. కానీ...ఈ బొమ్మలో ఐదు తప్పలున్నాయి. అంటే... వస్తువులు వుండాల్సినచోట కాకుండా మరెక్కడో వున్నాయన్నమాట. అవేంటో కనుక్కోండి చూద్దాం. తెలీకపోతే పేజీ తిరగేసి చూడండే.

1.చేపలను పెంచుకునే చిన్ని అక్వేరియం బాత్‌రూం గదిపైన అతుక్కుని వుంది. 2. తలుపుకు వున్న యాపిల్ 3. బాత్‌టబ్ కాలు స్థానంలో వున్న సాక్స్ 4. చెత్తబుట్టలో వున్న గిటార్ 5. అక్వేరియంలో వుండాల్సిన చేపలు కర్టెన్ మీద వున్నాయి.

కవల చంద్రులెవరో చెప్పకోండి



నేస్తాలూ...! పైన ఆరుగురు చంద్రుళ్లు కనిపిస్తున్నారుకదా. అర్రే... అలా నవ్వకండి. వీళ్లు పూర్ణచంద్రుళ్లు కాదులే. నెలవంక చంద్రుళ్లు. అందుకే అలా మూతులు, తలలు సాగిపోయినట్టు వున్నారు. పోనీలే అసలు విషయానికొచ్చేద్దాం. వారిలో ఇద్దరుమాత్రం ఒకేలా అచ్చుగుద్దినట్టు వున్నారు. వారెవరు? జవాబు పైవారం.

ఎలా వెళ్లాలబ్బా!



మేం చెప్పిన రంగులద్దండే



1. బ్లూ 2. గ్రీన్ 3.ఎల్లో 4.బ్రౌన్ 5. రెడ్

వీరివీరి గుమ్మడిపండు వీరి పేరేమి?



హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినదెవరో తెలుసా! అవున్లే... ఈమెను గుర్తించని వారు ఎవరుంటారు? అయితే మీరు ఏంచేయాలంటే... వెంటనే యమ అర్జంటుగా ఒక కార్డు తీసుకోండి. దాని మీద సమాధానం రాసి పోస్ట్ చెయ్యండే. మా చిరునామా: **వీరి వీరి గుమ్మడి పండు**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

16.10.05 సమాధానం:
ఐక్యరాజ్యసమితి పతాకం

9.10.05కు సరైన సమాధానాలు రాసినవారు

ముంద్రు మనోహర్, 7వ తరగతి, జడ్‌పిహెచ్‌స్కూల్, వేల్పూరు, గుంటూరు. దుస్సా అక్షయ్‌కుమార్, 5వ తరగతి, జనగామ. కె.రవి నాయక్, 8వ తరగతి, ఎపిటిఈబ్ల్యుఆర్ ఎస్, బాలనగర్. రాళ్లబండి సౌందర్య, 8వ తరగతి, విశ్వశాంతి హైస్కూల్, శ్రీరాంపూర్. యం.కిరణ్మయి, 9వ తరగతి, శ్రీ వాణి విద్యాలయం, జనగామ. టి. సురేందర్ గౌడ్, 10వ తరగతి, శ్రీ వాణి విద్యాలయం, జనగామ. కె.శ్రీఅనూహ్య, 7వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. వి.ఉదయశ్రీ, 4వ తరగతి, వి.సింధు, 2వ తరగతి, శ్రీ గౌతమి పబ్లిక్ స్కూల్, రాజమండ్రి, తూ.గో. టి.వి.ఎల్.నాయక్, శ్రీ వాణి విద్యాలయం, జనగాం, వరంగల్. బి.సృజన, 8వ తరగతి, గీతాంజలి ఉన్నత పాఠశాల, అశోక్ నగర్, హైదరాబాదు. కె.చరిత, 6వ తరగతి, పాయిస్ హై స్కూల్, రాంనగర్, హైదరాబాదు. ఎం.శ్వేత, 4వ తరగతి, అభ్యుదయ హైస్కూల్, హైదరాబాదు. కె.సాహిల్, 3వ తరగతి, అభ్యుదయ హై స్కూల్, అశోక్‌నగర్, హైదరాబాదు.

వీరిలో ఎవరు నచ్చారు?

హాయ్! పైన చిన్నారులంతా భలేగా ఆడుకుంటున్నారుకదూ. మరీ... మీకు వీరిలో ఎవరు నచ్చారు? అయితే వారి బొమ్మ చుట్టూ పెన్సిల్‌తో సున్నా చుట్టండి. తర్వాత ... మీకు వీలుంటే వారిలా ఎంచక్కా బయటకెళ్లి ఆడుకోండే.

అట్టమీది కథ

హాలీం...
ఇది పొలికేకో... మంత్రమో
కాదు... ఒక్కసారి రుచిచూసిన
వారికి ఈ పేరు వింటేనే
నోరూరిపోతుంది. అయితే చాలామందికి
దీని రుచి తెలీదు.

హసన్ షరీఫ్

అరేబియన్ వంటకమైన హాలీం ఇరానియన్ డిష్. హాలీం అనే అరబ్బీ పదానికి నరమ్ దిల్ (మెత్తని మనసు) అని అర్థం. మొఘల్ రాజుల కాలంలో ఇది హైదరాబాద్‌లో ప్రవేశించింది.

రంజాన్ స్పెషల్ హాలీం...

ఒక్కసారి హాలీం రుచిచూసిన వారికి ఈ పేరు వింటేనే నోరూరిపోతుంది. అయితే చాలామందికి దీని రుచి తెలీదు. మా ఫ్రెండ్ కూడా దీని రుచి ఎలా ఉంటుందో చెప్పమని ప్రాణం తీస్తున్నాడు. మాంసాన్ని కైమాచేసి గోధుమలు ఇతర సుగంధద్రవ్యాలతో ఉడికించి, పేస్టులా చేస్తారని చెపితే అతనికి అర్థం కావట్లేదు. రుచి చూపిద్దామంటే అతను శాకాహారి. ఎప్పుడో చిన్నప్పుడు విన్న కథ గుర్తొచ్చింది. మూడు ముక్కల్లో చెపుతాను...

పూర్వకాలం ఒక అరేబియా దేశస్తుడు భార్యతో భారతదేశం వచ్చాడు. అది వేసవికాలం కావటంతో ఇష్టంగా మామిడి పండ్లు తిన్నారు. అరేబియా వెళ్ళాక అక్కడివారికి మామిడి పండు రుచి చెప్పి ఊరించాడు. ఈ విషయం అక్కడి రాజుకు తెలిసి అతన్ని పిలిపించాడు. మూడు రోజుల్లో మామిడి పండు రుచి చూపించకపోతే తల తీయిస్తానని హుకుం జారీ చేశాడు. భయంతో అతను మంచం పట్టాడు. ఈ గండం నుండి బయటపడటానికి అతని భార్య మాత్రం తీవ్రంగా ఆలోచిస్తోంది. రెండో రోజు ఆమె తన భర్త గడ్డానికి చింతపండు పులుసు, చక్కెరపాకం కలిపి పట్టించింది. చావబోతుంటే ఇదేంటి... అంటూ అతను విసుక్కున్నాడు.

మూడో రోజున రాజు అతన్ని పిలిపించాడు. తనకు చావుమూడిందని రాజు దర్బారుకు ఏడుపుముఖంతో వెళ్ళాడు. అక్కడ అతని ఎండిపోయి, ఇలకరుచుకుపోయిన గడ్డం చూసి అందరూ నవ్వసాగారు. ఇంతలో అతని భార్య, రాజును ఒక్కసారి గడ్డం చీకమని ప్రాధేయపడింది. రాజుకు కోపం వచ్చింది. అతని గడ్డం చీకితే మామిడి పండు రుచి తెలుస్తుందని ఒక్కసారి చప్పరించి చూడమని వేడుకొంది. రాజు అయిష్టంగా అతని గడ్డం చప్పరించాడు. పుల్లపుల్లగా, తియ్యతియ్యగా ఉంది. వదలబుద్ధికాలేదుట... ఈ రంజాన్ సీజన్ వెళ్ళిపోయాక "హాలీం" ఎలా ఉంటుందంటే దాని రుచి చెప్పడానికి ఈ అరబ్బీ జానపదకథలోలాగ కష్టపడాలేమో !



ఫ్రెండ్‌కు హాలీం రుచి ఎలా చూపించాలో అర్థంకాక మధనపడుతూ హాలీం తింటుంటే, పక్కనుండి ఎవరో ప్లేట్ వెజిటేరియన్ హాలీం... అంటూ ఆర్డర్ చేశారు. ఏంటీ...! వెజిటేరియన్ హాలీం ఉందా!... అంటూ ఆశ్చర్యపోయి, వెంటనే మా ఫ్రెండ్‌కు ఫోన్‌చేసి పిలిపించి తినిపించా. ప్లేట్ 40 రూపాయలేనట! వేడివేడి హాలీంను ఉఫ్... ఉఫ్‌న ఊదుకుంటూ తింటుంటే అతని ముఖంలో కోటి మతాబాల వెలుగు. ఖాళీచేసిన పింగాణీ ప్లేట్‌ను కిందపెట్టి సంతోషంతో టేస్టీ హాలీం... నోరూరించే హాలీం... అంటూ మెలికలు తిరిగిపోతూ స్టెప్పులేశాడు.

అతనే కాదు రంజాన్ మాసంలో హైదరాబాద్‌లో ఎవరి నోట విన్నా ఇదే మాట. హిందూ-ముస్లిమ్ అనే భేదం లేకుండా నగరంలో ప్రతిఒక్కరూ ఈ నెలలో కనీసం ఒక్కసారైనా హాలీం తినాలని కోరుకుంటారు. మాంసంతో తయారు చేసే ఈ హాలీం టేస్ట్ ఇప్పుడు రాష్ట్రంలోని ఇతర నగరాలకు కూడా పార్శిల్ అవుతోంది. ముస్లింలు ఎక్కువగా నివసించే ఇతర ప్రధాన నగరాల్లో కూడా హాలీంను తయారు చేస్తున్నారు. అయితే హైదరాబాద్ హాలీంకు ఉన్న పేరు వాటికి రాలేదు. అంతేకాదు... దేశ విదేశాల నుండి సిటీకి ఆర్డర్లు వస్తున్నాయి. గత ఏడాది ప్రయోగాత్మకంగా ప్రారంభించిన 'పోస్టాఫీసు ద్వారా హాలీం' అనే స్కీం బంపర్ సక్సెస్. ఈ స్కీం పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు కూడా లాభదాయకంగా మారింది. 'రోజుకు కనీసం ఐదువేల ప్యాకెట్లను సరఫరా చేస్తున్నాం. నెల రోజుల్లో కోటి రూపాయలకు పైగా ఆదాయం పొందగలం...' అని పోస్టాఫీసు అధికారి గోవింద్‌రాజన్ అన్నారు. ఇటీవల ఇంటర్నెట్‌లో కూడా "హాలీం ఆన్ స్పీడ్ పోస్ట్" ప్రవేశపెట్టడాన్ని గమనిస్తే హాలీంకు ఇంత డిమాండా... అని ఆశ్చర్యపోతారు.

రంజాన్‌మాసం కోసం ఏడాదంతా...

ముస్లింలు ఈ రంజాన్ నెల కోసం సంవత్సరమంతా ఎదురుచూస్తారు. తాము సంపాదించే దాంట్లో కొంత ఈ రంజాన్ నెల ఖర్చుకోసమనుకుంటూ కూడా సంపాదిస్తారు. ఈ నెల వచ్చిందంటే...ఏడాదంతా వాడుకునేలా మంచి టోపీలను, ఖురాన్ పవిత్ర గ్రంథంపై పరిచే లేసులల్లిన ఆకుపచ్చ గుడ్డలను, రకరకాల వాసనల సెంటు సీసాలను కొంటారు. ఇలాంటి అమ్మకాలు-కొనుగోళ్లతో రాష్ట్రమంతటా సందడేసందడి. ఇక సేమ్యాల సంగతి చెప్పనే అక్కర్లేదు. తమ ఇంట వండేందుకే కాదు తమ పొరుగువారు హిందువులైనా, క్రైస్తవులైనా వారికి కూడా పంచేందుకు ఈ సేమ్యాలను చేస్తారు. ఏడాది అంతా సంపాదించిన డబ్బును ఈ నెలలో చేతికి ఎముక లేదన్నవిధంగా ఖర్చు చేస్తారు. పేద, ధనిక బేధం లేకుండా అందరూ ఏదో ఒక వస్తువును కొనాలని ఉవ్విళ్ళూరుతారు. అంతేకాదు పండుగ చేసుకోలేని వాళ్లకు కొత్త బట్టలు కొనిచ్చి, వాళ్ళు సంతోషంగా పండుగ చేసుకునేందుకు ఆర్థిక సహాయం చేయటం కూడా తమ కనీస బాధ్యతగా ముస్లింలు భావిస్తారు. దీన్నే "జకాత్" అంటారు. జకాత్ గురించి ఖురాన్‌లోనూ ప్రస్తావన ఉంది.

"అఖీముత్ సలాత్ వాతుస్ జకాత్ వఖారే జులాహా ఖరాజన్ హస్సనాహ్"
(నమాజ్ చేస్తూ ఉండండి. జకాత్ ఇస్తూ ఉండండి. దేవుడి మార్గంలో సాధ్యమైనంత దానం ఇస్తూ ఉండండి.)

ముస్లింలు రోజంతా పచ్చి మంచినీళ్లు కూడా ముట్టకుండా కఠిన ఉపవాస దీక్ష (రోజా) చేస్తారు. రోజంతా నష్టపోయిన శక్తిని సాయంత్రం "రోజా" వీడిన తర్వాత మళ్లీ పుడ్చుకునే ప్రయత్నం చేస్తారు. అలా చేస్తేనే మరుసటి రోజు ఉపవాసానికి సిద్ధమవ్వగలరు. ఖర్జూర, ద్రాక్ష, నారింజ, బొప్పాయి, యాపిల్, పైనాపిల్... ఫలాలతో "ఇఫ్తార్" చేసిన తర్వాత హైదరాబాద్ వాసులు ఈ హలీం తింటారు. నగరంలోని దాదాపు అనేక హోటళ్ళ ముందు ప్రత్యేకంగా పొయ్యిని ఏర్పాటుచేసి హలీంను తయారు చేస్తారు. హలీం అమ్మకాలపై హోటల్ యజమానులు రంజాన్ నెలలోనే కోట్ల రూపాయల వ్యాపారం చేస్తారట!. ఇంతకూ ఇది మన సంప్రదాయ వంట కాదు. అరేబియన్ వంటకమైన హలీం ఇరానియన్ డిష్. హలీం అనే అరబ్బీ

హలీం కస్టమర్లు సగం మంది హిందువులే!

హలీం గురించి తెలుసుకుందామని తిరుగుతుంటే, ఏ హోటల్ యజమానిని కలిసినా "హలీం కా పూరా సమాచార్ లేనా హై తో "పిస్తాహౌజ్" జానా..." అన్నారు. దీంతో చార్మినార్ సమీపంలోని షాలిబండలోని పిస్తాహౌజ్‌కు వెళ్ళా, అక్కడ చూద్దును కదా... ట్రాఫిక్ జామ్. మెల్లగా చోటు చేసుకుని పిస్తాహౌజ్‌లోకి వెళితే, ఓ పెద్దాయన ఏప్రాన్ వేసుకుని అక్కడి సప్లయర్లకు ఆదేశాలిస్తున్నాడు. ఆయన దగ్గరకుపోయి మీ ఓనర్ మజీద్ భాయ్‌ను కలవాలన్నా. ఆయన చిరునవ్వుతో నేనే అంటూ తన ఆఫీసులోకి తీసుకుపోయారు. కోట్లాది రూపాయల వ్యాపారం చేసే అయన అతి సామాన్యంగా ఉండటం ఆశ్చర్యపరిచింది. ఆయనేమంటారో చూడండి...

ప : ఈ రంగంలో ఎప్పటి నుండి కొనసాగుతున్నారు?

జ : గత ఏడేళ్ల నుండి ఈ హలీం తయారు చేస్తున్నాను. మా నాన్న నాంపల్లిలోని "యూసుఫియన్ క్లాత్ మర్చంట్"ను నడిపేవారు. తర్వాత పత్తర్‌గట్టీలో మరో బట్టల దుకాణం పెట్టాం కానీ రోజురోజుకూ పోటీ పెరిగిపోవడంతో హోటల్ వ్యాపారంలో అడుగుపెట్టాను. ఒక హోటల్, స్వీట్ హౌస్ ప్రారంభించాను. రంజాన్ నెలలో అందరు హోటల్ యజమానుల మాదిరిగానే నేనూ హలీం తయారు చేశాను. అనూహ్యంగా తొలి ప్రయత్నంలోనే టేస్టీగా ఉందని జనం ఎగబడి తిన్నారు. దీంతో నగరంలో నా హోటల్ పేరు మారుమోగింది. మరుసటి ఏడాది ఇంకా టేస్టీ హలీం తయారు చేశాను. దీంతో నా పిస్తా హౌస్ పేరు రాష్ట్రవ్యాప్తంగా మార్మోగింది. విదేశాలకు ఎగుమతి, పోస్టల్ సర్వీసును ప్రారంభించడంతో ప్రపంచంలోనే నెంబర్ వన్ హలీం సెంటర్‌గా నిలిచింది.

ప్ర : మీ వ్యాపారం ఏయే ప్రాంతాలకు విస్తరించింది?

జ : మా పిస్తాహౌస్ బ్రాంచీలను నగరంలోని అనేక ప్రాంతాల్లో నెలకొల్పాం. దుబాయ్, సౌదీ

అరేబియాలోని జిడ్డా రియాద్, దమ్మామ్, సింగపూర్, మలేసియా తదితర ఆసియా దేశాలకు ఎగుమతి చేస్తున్నాను. రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, నల్గొండ, సంగారెడ్డి, కరీంనగర్, సిద్ధిపేట, షాద్ నగర్, జహీరాబాద్, సదాశివపేట తదితర నగరాలకు పోస్టులో పంపిస్తున్నాం. ఇటీవల ముంబయి సినీ స్టార్లు కూడా పోస్టులో పంపించాల్సిందిగా ఆర్డర్ చేశారు. వివిధ నగరాల్లోని వారు ఆర్డర్ చేసిన నాలుగు గంటల్లోనే వాళ్ల దగ్గరికి హలీం చేర్చడం మా ప్రత్యేకత.

ప్ర : మీ సక్సెస్ రహస్యం ?

జ : నా వ్యాపార రహస్యాలు చెప్పలేను. ఒక్కటి మాత్రం చెప్పగలను. నా దగ్గరికి వచ్చే కష్టమర్లలో సగం మంది హిందువులే. వాళ్లు నగరంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేకంగా హలీం తినేందుకే వస్తున్నారు. 542 మంది పనివాళ్లలో సగానికిపైగా ముస్లిమ్‌లుకానివారే. కష్టమర్ల రద్దీతో సాయంత్రం ఏడు నుండి తొమ్మిదింటి వరకు ఇక్కడ ట్రాఫిక్ జామ్ అవుతుంది.

ప్ర : మీ గురించి చెపుతారా?

జ : అన్వర్-ఉల్-ఉలుమ్ కాలేజీలో బికాం పూర్తి చేశాను. 1982-83లో కాలేజీ ఎన్నికల్లో సెక్రటరీగా కూడా బాధ్యతలు నిర్వహించాను. విద్యార్థి దశ నుండే నాకు సామాజిక కార్యక్రమాల పట్ల స్పృహ ఎక్కువ. ఆర్థికంగా వెనకబడిన వాళ్లకు నా వంతు సహకారం అందిస్తుంటాను. గత ఏడాది హృద్రోగంతో బాధపడుతున్న పిల్లలకు నెల రోజుల పాటు ఒక్క రూపాయికే ప్లేట్ హలీం పంపించాను. చదువులో వెనకబడిన వాళ్ల కోసం ఈ ఏడాది నుండి ఉచితంగా ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉంది. డిసెంబర్‌లోపు ఆ ఇన్‌స్టిట్యూట్‌ను చార్మినార్ పరిసర ప్రాంతంలో ప్రారంభిస్తాను.

పదానికి నరమ్ దిల్ (మెత్తని మనసు) అని అర్థం. మొఘల్ రాజుల కాలంలో ఇది హైదరాబాద్‌లో ప్రవేశించింది. దీన్ని తయారు చేసేందుకు 6-8 గంటలు పొయ్యిమీద ఉడికించాలి. పైగా నిరంతరం పాత్రలోని సరుకును చెక్క గరిటెతో తిప్పుతూ ఉండాలి. అందుకే ఇళ్ళల్లో దీన్ని తయారుచేయలేరు.

హలీం సప్లయి చేయడానికి ఎంత మంది సర్వర్లో !

హలీంను ఇలా చేస్తారు

ఒక కిలో గోధుమ నూక, మూడు కిలోల మాంసం, మూడు కిలోల నెయ్యి, పెరుగు, ఉల్లిగడ్డలు, పది గ్రాముల దాల్చినచెక్క, కవాబ్ చీనీ, షాజీర, ఐదు గ్రాముల లవంగాలు, ఒక గ్రామ్ జాఫ్రాన్ తదితర వస్తువులను ఒక పెద్ద దేకిషాలో వేసి ఉడకబెడ్తారు. హోటల్ ముందు పొయ్యిని ప్రత్యేకంగా నెలకొల్పుతారు. నిప్పుల సెగ ద్వారా పాత్రలోని పదార్థాలను ఉదయం పదకొండు గంటల నుండి సాయంత్రం ఆరున్నర వరకు ఉడికిస్తూనే ఉంటారు. కట్టెతో తయారు చేసిన గరిటెతో ప్రతి పది నిమిషాలకు ఒకసారి హలీంను కలియబెడ్తారు. వంటవాళ్లు ఎంత సమర్థవంతంగా కలపగలుగుతారో హలీం అంత టేస్టీగా తయారవుతుంది. ఒక విధంగా చెప్పాలంటే వంటవాళ్ల ఓపికకు హలీం రుచి నిదర్శనం. గరిటెతో కలపడంలో బద్దకం చూపిస్తే హలీం క్వాలిటీలో తేడా వస్తుంది..

ఒక ప్లేట్ హలీం 300 గ్రాములు ఉంటుంది. అందులో దాదాపు 200 గ్రాముల మాంసం ఉంటుంది. మేక మాంసంతో (మటన్ హలీం), కోడి మాంసంతో (చికెన్ హలీం), గొడ్డు మాంసంతో (బీఫ్ హలీం) తయారు చేస్తారు. నగరంలో మటన్ హలీం ప్లేట్ 25 నుండి 40 రూపాయల వరకు ధర పలుకుతోంది. చికెన్ హలీం 25 నుండి 30 రూపాయలు. బీఫ్ హలీం ప్లేట్15 నుండి 20 రూపాయలు ఉంటుంది.

హలీంను హోటళ్లలో రద్దీని తట్టుకునేందుకు ప్రముఖ హోటల్ యజమానులు తమ హలీంను కష్టమర్ల ఇంటికే వెళ్లి అందించే ఏర్పాటు చేస్తున్నారు. దీని కోసం పోస్టాఫీసు సహాయాన్ని తీసుకుంటున్నారు. నగరంలో పద్మవ్యూహం లాంటి ట్రాఫిక్‌ను దాటుకుని హోటల్‌కు వెళ్లి హలీం తినే బదులు, ఫోన్‌లో ఆర్డర్ చేసి ఇంటి గుమ్మంలోకి తెప్పించుకుంటున్నవారి సంఖ్య పెరిగింది. సమీపంలోని పోస్టాఫీసుకు వెళ్ళి తమకిష్టమైన హలీంను తినే వారు పెరిగారు. రంజాన్ తొలిరోజే పోస్టాఫీస్‌కు మూడు వేల ఆర్డర్లు వచ్చాయని "పిస్తాహౌజ్" యజమాని మహ్మద్ అబ్దుల్ మజీద్ అన్నారు. అంతేకాదు, ముంబయి సినీస్టార్లు కూడా పిస్తాహౌస్ నుండి పోస్టు ద్వారా హలీంను తెప్పించుకుంటున్నారు. టాలీవుడ్ స్టార్లతో పాటు సల్మాన్ ఖాన్, షారూఖ్ ఖాన్, రవీనా టాండన్ తదితర బాలీవుడ్ స్టార్లు కూడా ఆర్డర్ సాధారణంగా ప్లేటుకు 40 రూపాయలు తీసుకునే హోటల్ యజమానులు పోస్టల్ ద్వారా సరఫరా చేస్తే 50 రూపాయలు వసూలు చేస్తారు. పోస్టు ద్వారా మూడు ప్లేట్లకు 132 రూపాయలు, ఐదు ప్లేట్లకు 205 రూపాయలు, వసూలు చేస్తామని అంటున్నారు. ఇక ఆలస్యమెందుకూ మీరూ ఒక పట్టుపట్టండీ...

టిఫిన్ బాక్స్‌తో పని లేదు

తెనాలికి చెందిన నేను హైదరాబాద్ వచ్చి పదేళ్లయింది. డ్యూటీ నుండి ఇంటికి వెళ్తూ హలీం తినడం అలవాటుగా మారింది. సెలవు రోజుల్లో పిస్తాహౌస్‌కు వచ్చి తింటాను. స్నేహితుల బలవంతం మీద మొదటిసారి తిన్నప్పుడు నచ్చలేదు. పూర్తిగా తినలేకపోయాను. రెండోసారి మాత్రం పూర్తిగా లాగించాను. దాని టేస్ట్ నచ్చింది. పుష్టికర ఆహారం అని తెలుసుకున్నాక దానిపై ఆసక్తి కలిగింది. ఇప్పుడు ఒంటరిగా కూడా వెళ్లి తింటున్నాను. హలీం తిని రాత్రి డ్యూటీకి వెళ్తే టిఫిన్ బాక్స్ తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు.

నరేష్, కంప్యూటర్ హార్డ్‌వేర్ మెకానిక్.

పుష్టికరం బలవర్ధకం

నేను రంజాన్ నెలలో రోజూ హలీం తింటాను. ఈ నెలలో రోజా(ఉపవాసం) ఉంటాం కాబట్టి పుష్టికర ఆహారం తినాలి. అప్పుడే నెల రోజుల పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా రోజా ఉండగలుగుతాం. ఏడాది పాటు సంపాదించిన డబ్బును కూడా ఈ నెలలోనే హృదయపూర్వకంగా ఖర్చు చేయాలని ఖురాన్‌లో ప్రస్తావన ఉంది. పిస్తాహౌస్‌లో వారానికి ఒక్కసారైనా తింటాను. అక్కడి ఒక్క ప్లేట్ హలీం తింటే ఆ రాత్రి భోజనం చేసినంత శక్తి వస్తుంది.

బషీర్ హుస్సేన్ (లిఫ్ట్ మెకానిక్), అంబర్ పేట, హైదరాబాద్.



ఆరోగ్యం

విటమిన్ల కథ

విటమిన్ ఇ

డాక్టర్ నాగినేని భాస్కరరావు

కొవ్వు కరిగే విటమిన్లలో విటమిన్ - ఇ ఒకటి. ఎనిమిది టోకోఫెరాల్స్, టోకోట్రినాల్స్ విటమిన్ - ఇ తో పాటు ఒకే ధర్మాలు కలిగి ఉన్నవి గుర్తించబడ్డాయి. ఆల్ఫా టోకోఫెరాల్ అనేది మిక్కిలి శక్తివంతమైనది. దీనిని వ్యాపారపరంగా తయారు చేస్తున్నారు.

ఇది ఒక యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. విటమిన్ - ఇ ఇతర యాంటీ ఆక్సిడెంట్లు అయిన విటమిన్ - సి, బీటా కరోటిన్‌లతో కలిసి పనిచేస్తుంది. ఇవి గుండెకు మంచి రక్తాన్ని సరఫరా చేసే కరోనరీ ధమనులను జబ్బు నుంచి కాపాడుతాయి.

మధుమేహం, కరోనరీ ఆర్టరీ జబ్బు, రక్తపోటు, వక్షోజాల జబ్బుల్లో విటమిన్ - ఇ ని కూడా అదనంగా ఇస్తే ఉపయోగం కలుగుతుంది. భారతదేశపు ప్రజల ఆహారంలో రోజువారీ అవసరం కన్నా ఇది సమృద్ధిగా లభిస్తుంది. రోజువారీ అవసరం 5 నుంచి 15 మిల్లీగ్రాములు.

నెలలు తక్కువగానూ, తక్కువ బరువుతోనూ పుట్టిన బిడ్డల్లోనూ, పోలీ అన్‌శాటురేటెడ్ ఫాటీ యాసిడ్ రిచ్ ఫార్ములాతో ఉన్న పాలతో పెంచబడిన పిల్లల్లోనూ విటమిన్ - ఇ లోపం ఉన్నట్లు కనుగొన్నారు. సరిగ్గా ఆహారం లేని పిల్లల్లోనూ, మాల్అబ్జార్పషన్ సిండ్రోమ్ అనే వ్యాధితో బాధపడే పిల్లల్లోనూ విటమిన్ - ఇ లోపం ఉన్నట్లు రిపోర్టులున్నాయి.

విటమిన్ - ఇ లోపం లక్షణాలు

శిశువులో హిమోలైటిక్ ఎనీమియా, ఇంక్రీజ్‌డ్ క్రిత్రోసైట్ ఫ్రాగిలిటీ, శరీరం వాపు, చర్మంపై ఎర్రని దద్దులు, అసాధారణ కేసుల్లో కండరాలు క్షీణించడం, ఇంక్రీజ్‌డ్ సీరమ్ క్రియేటైన్ ఫాస్ఫో (సిపికె) వంటి లక్షణాలు విటమిన్ - ఇ లోపం వల్ల ఏర్పడతాయి. పెద్దల్లో రక్తంలో 0.8 మి.గ్రా./100 మి.లీ. కన్నా తక్కువగా విటమిన్ - ఇ ఉన్నట్లయితే దానిని లోపంగా పరిగణించాలి.



ఆల్ఫా టోకోఫెరాల్‌ను ఇవ్వడం ద్వారా విటమిన్ - ఇ లోపాన్ని సరిచేయవచ్చు. మాల్ అబ్‌సార్పషన్ లో డిఎల్-డి-టోకోఫెరాల్ ఎసిటేట్ 30 నుంచి 100 మి.గ్రా. కండరానికి ఇంజక్షన్ ద్వారా ఇవ్వాలి.

ఈ విటమిన్ మొక్కలలో ఎక్కువగా లభిస్తుంది. వృక్షజాతి నూనెలు, సోయాబీన్ నూనె, మొక్కజొన్న నూనె మొదలగు వాటిలో ఎక్కువగా లభిస్తుంది. మొలకెత్తే (చిక్కుడు జాతికి చెందిన) విత్తనాల్లో ఉదాహరణకు చిక్కుడు, పెసలు, శనగలు మొదలగు వాటిలోనూ, ధాన్యాలలోనూ (హోల్ సెరియల్స్) విటమిన్ - ఇ లభిస్తుంది. జంతువుల ధాతువుల్లో ఇది తక్కువగా ఉంటుంది. ✢





కథ

ఫాల్స్ స్టేటస్ కోసం పాకులాడుతున్న మనం అనాధలమా? లేక మంచితనంతో తన చేతలతో నలుగురినీ ఆదరిస్తూ తనకంటూ కొందరు ఆత్మీయులను సంపాదించుకున్న శరణ్ అనాధా...?

కారంపూడి వెంకట రామదాస్

ఎవరు అనాథ?

"ఏమోయ్ శరణ్! వీక్లీ రిపోర్టులన్నీ హెడ్డాఫీసుకు పంపేవా....?"అడిగాడు మేనేజరు మోహన్ రావు.

"ఈ మెయిల్లో అటాచ్మెంట్ ఫైల్గా పంపాను సార్. కాపీ మీకూ మార్కు చేశాను. డౌన్‌లోడ్ కాలేదా...?" సందేహంగా అడిగాడు శరణ్.

"నేనింకా ఏమెయిల్ చెక్ చేయలేదు. అయినా నీకప్పగించాక ఆ పని బాధ్యతతో పూర్తిచేస్తావనుకో..."

"సార్...! సేల్స్ ప్రమోషన్ ఏక్టివిటీస్ గురించి మీతో డిస్కస్ చేయాలి...డిసిషన్స్ కోసమొచ్చా..."

"చూడు మాధవి...వుయ్ హేవ్ ఫుల్ ఫైత్ ఆన్ యూ... యుకెన్ గో ఎహెడ్" అభయమిచ్చాడు మోహన్ రావు.

"అన్నట్లు శరణ్...నిన్న టీవీలో అనాధ పిల్లలగురించి ఓ ప్రోగ్రామొచ్చిందోయ్... చూస్తున్నంత సేపూ నువ్వే గుర్తొచ్చావనుకో... " అంటూ మోహన్ రావు ఇంకా ఏదో చెప్పబోయాడు.

"సార్...! అర్జంటు లెటరొకటి ఫాక్స్ చేయాలి. మళ్లీ వస్తాను" అంటూ శరణ్ చిన్నబోయిన మొహంతో బయటికి నడిచాడు.

"ఆ...మాధవీ...నువ్వేదో డిస్కస్ చెయ్యాలన్నావు..?" అన్నాడు మోహన్‌రావు.

"నో...సార్...! నేను వివరాలతో తరువాతొస్తాను...." అతడితో మాట్లాడాలనిపించక తన సీట్లోకెళ్లి కూర్చుంది మాధవి.

"ఏం మనుషులు వీరు? ఎందుకు ఎదుటివారిని గాయపరిచేట్లు మాట్లాడతారు?" ఇలా పరిపరివిధాలుగా ఆలోచిస్తోంది మాధవి.

"మేడమ్! మన ఎకౌంట్సాఫీసరు ఉమామహేశ్వరరావు రిటైరు కాబోతున్నారు కదా. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సత్కరించాలనుకున్నాం. మీ వంతు కంట్రిబ్యూషనెంత రాసుకొమ్మంటారు మేడమ్?" అంటూ ఓ కాగితం తీసుకొచ్చాడు ఆఫీసు బోయ్ ఓబులు.

"ఇంకా టైముందిగా...రేపో, ఎల్లుండో ఇస్తా..." అని ఓబులును పంపేసింది.

ఓబులు తిన్నగా శరణ్ సీటు దగ్గరికెళ్లి, విషయం చెప్పి...

"సార్...అందరి కంటే మీరే ఎక్కువివ్వాలి" అన్నాడు.

"లేదు...ఓబులు...ఆయనకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తప్ప నేనేమీ ఇవ్వలేను" అన్నాడు శరణ్.

"ఏమిటీ? ముందూ వెనుకా ఎవరూ లేని మీరు ఓ ఐదొందలివ్వలేరా...?" ఓబులు మాటల్లో చులకన భావం.

"వీడు అనాధే అనుకున్నాం... డబ్బు మనిషీ అనిప్పుడే తెలుసుకున్నాం" అని ప్రత్యక్షంగా కొందరు, పరోక్షంగా కొందరు శరణ్ని తిట్టిపోశారు. అయినా అతను తన నిర్ణయాన్ని మార్చుకోలేదు.

"మాధవీ...ఈ రోజు శరణ్ లీవులో ఉన్నాడు. ఈ ఒక్కరోజుకూ అతని వర్కు నువ్వు టేకప్ చెయ్యి!" ఆర్డరేశాడు మోహన్ రావు.

"అలాగే సార్...!" అంది మాధవి.

శరణ్ టేబుల్ డ్రాలో కాగితాల నడుమ ఆఫీసు డైరీ కనబడింది. బహుశా పెండింగ్ వర్కు అందులో శరణ్ రాసుంటాడని పేజీలు తిరగేసింది మాధవి. కొన్ని పేజీలు స్వవిషయాలతో నిండి ఉన్నాయి. తప్పని మనసు హెచ్చరించేలోపల మెదడు సగం విషయాలను గ్రహించేసింది. గిల్టీ మనసుతోనే మొత్తం చదవడం పూర్తిచేసింది.

అది లంచ్ అవర్! ఆఫీసు స్టాఫంతా ఖుషీగా కబుర్లు చెప్పుకుంటూ తింటున్నారు.

"ఏంటోయ్...శరణ్...ఏం తెచ్చావేంటి...? అడిగాడు కృష్ణమూర్తి.

"ఆ... వెరైటీ ఏం లేదు, అన్నం పులుసు" సిగ్గుపడుతూ చెప్పాడు శరణ్.

"అవున్లే...నీకెవరున్నారని...? కమ్మనైన వెరైటీలు చేసిపెట్టడానికి! ఒంటరి ప్రాణివి కదా..." వేళాకోళంగా అన్నాడు.

ఈ మాటలు వింటూ మిగతా వారు ఎంజాయ్ చేస్తున్నారు.

"అయినా శరణ్... నాదో చిన్న సలహా! గంతకు తగ్గ బొంత వత్తినైనా చూసి మూడుముళ్లూ వేసేయరాదూ...? నీకీ తిప్పలు తప్పుతాయి" అన్నాడు కృష్ణమూర్తి మేటర్ని పొడిగిస్తూ.

ఈ మాటలకు మాధవి హృదయం భగ్గుమంది.

"స్టాపిట్...ఐసే...!" కోపం కట్టలు తెంచుకోగా ఒక్క ఉదుటన లేచి అపరకాళిలా అరిచింది మాధవి.

కృష్ణారావు తలదించుకున్నాడు.

"ఎందుకిలా ప్రతిఒక్కరూ సూటిపోటి మాటలతో శరణ్ని బాధిస్తారు. సార్...మోహన్ రావుగారూ...మీకు అనాధలంటే చాలా జాలి కదూ. ఓ అనాధను చేరదీసి పెంచుకుంటే ఇటు మీకు పిల్లలు లేని లోటూ అటు ఓ అనాధకు దారి చూపినట్లూ అవుతుందని ఎప్పుడైనా ఆలోచించారా...? లేదే... అనాధలపై జాలి తప్ప వారిని నిజంగా ఆదుకోవాలనే ఆలోచన మీకు లేదు. కానీ శరణ్ ముగ్గురు అనాధలను తన జీతంతో పోషిస్తున్నాడు"

"మాధవిగారూ...కంట్రోల్ యువర్ సెల్ఫ్..." అభ్యర్థన పూర్వకంగా అన్నాడు శరణ్.

"నో...లెటమీకంటిన్యూ..."

"ఆ రోజు మన ఎకౌంటెంట్ ఫేర్‌వెల్‌కు శరణ్ చందా ఇవ్వలేదని అతణ్నందరూ డబ్బుమనిషన్నారు. మన ఆయా అలివేలు ఆసుపత్రి పాలైతే మనలో ఒక్కరన్నా వెళ్లి ఆమెను పలకరించామా? కానీ శరణ్ ఆమె ఆసుపత్రి ఖర్చులన్నీ భరిస్తున్నాడు. అంతెందుకు... ఎవరో మనలాంటి పుణ్యాత్ముల వెలికి గురైన ఓ ముసలావిడను వృద్ధాశ్రమంనుంచి దత్తత తీసుకుని ఆమెకు కొడుకుగా తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని నిశ్చయించుకున్నాడు"

"ఇప్పుడు చెప్పండి! తల్లిదండ్రులను, రక్తసంబంధీకులనూ స్వార్థంతో దూరం చేసుకుంటూ సమాజంలో ఫాల్స్ స్టేటస్ కోసం పాకులాడుతున్న మనం అనాధలమా? లేక మంచితనంతో తన చేతలతో నలుగురినీ ఆదరిస్తూ తనకంటూ కొందరు ఆత్మీయులను సంపాదించుకున్న శరణ్ అనాధా...?

"ఇంతకీ...శరణ్ని ఎవరు పెళ్లి చేసుకుంటారనేగా మీ సందేహం. మా మనసులెప్పుడో కలిశాయి. నాకూ శరణ్‌కు త్వరలో పెళ్లి" కొసమెరుపుగా వినిపించింది మాధవి. ✢

పప్పెట్ ఇంటర్వ్యూ

ఉదయశంకర్

కత్తి డాలు పడేస్తనేం...?!

బొమ్మలకొలువుల్లో కొలువైన పపెట్‌లన్నీ దసరా సీజన్లో సరదాగానే గడిపాయంట! ఆ బొమ్మలకొలువుల్లో పెట్టే కొయ్యబొమ్మలకు ఎక్స్‌పర్ట్ కొండపల్లి. అలాంటి మరో పల్లివారి తయారీలో ఈసారి వెరైటీగా మన జానపద కథల పాత్రల, టీవీ సీరియళ్ల పాత్రల బొమ్మల్ని చేశారు. అందులో మన చందమామ కథల భేతాళుడు, విక్రమార్కుడు, పెదరాశిపెద్దమ్మల దగ్గర్నుంచి నేటి రాజకీయమ్మన్యుల వరకూ అందరివీ ఉన్నాయి. గత కొన్ని వారాలుగా భేతాళుడు, విక్రమార్కులవారు కలిసి బివి టీవి పెట్టారు కదా...వారానికొకర్ని ఇంటర్వ్యూ పేరిట ఉతికి ఆరేస్తున్నారు కదా...ఈసారి ఈ పపెట్(బొమ్మల)కొలువులో చేతికందుబాటులో దొరికారుకదాని తెరాస అగ్రనాయకుడు చంద్రశేఖరుణ్ని పట్టుకున్నారు. వారసలే అయోమయావస్థ, దిక్కురహిత, చింతాక్రాంత మానసులై, మనవడి బారసాల నుండి అప్పుడే తెరాసా పార్టీ కార్యాలయానికి వచ్చి ఉన్నారు. బోసిపోయి ఉన్న ఆ కార్యాలయానికే "బీవీ టీవీ" ప్రతినిధుల వేషంలో బి తాళ్, వి మ్మార్క్‌లు వెళ్లారు. మీడియా ప్రతినిధులనగానే ఒళ్లంతా మంటలుపుట్టినట్లయి, అలవాటు ప్రకారంగా మాటలు "దంచ"బోయి తమాయించుకున్నారు. అలవికాని సమయమున అధికులమనరాదని గుర్తుకు వచ్చింది. అధికులమన్న సీజన్ ఫేడవుటయిందని యాదికొచ్చింది. అందుకని గమ్మునుండిపోయి బుద్ధిగా "ఏంటిలా వచ్చారు...అందరూ బాగేనా" అంటూ పలకరింపు చిరునవ్వొకటి పెదాలకంటించుకున్నారు. "సార్ ఒక్క నిముషం అలా మీ చిరునవ్వు ఫ్రీజ్‌చేయండి సార్...షూట్ చేసుకుంటాను" అంటూ బి తాళ్ తన కెమేరా చంద్రశేఖరుడిపై ఫోకస్ చేసుకున్నాడు. వి మార్క్ తన నోట్‌బుక్ పేజీ తెరిచి రాసుకోవడానికి రెడీ అయిపోయాడు.



వి మార్క్ : సార్...మీరు ఇటీవల మీ కత్తి-డాలు పడేశారుట కదా... అలాంటి మీతో యుద్ధమేంటని స్వయాన మీ ఎమ్మెల్యే, మాజీ మంత్రివర్యులం అంటున్నారు... మీ కామెంట్.

కెసిఆర్ : అంటే ఆయన ప్రత్యేక తెలంగాణా కోసం యుద్ధం మానేసి, నాతో చేయడానికి మాత్రమే ఉన్నాడనేగదా అర్థం. ఇలాంటివారి నుండి నేను దూరంగా ఉందామని, పార్టీని దూరంగా ఉంచుదామనే అయన్ను పార్టీకి దూరం చేశాను. ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసిందందుకే కదా!

వి మార్క్ : ఏకపక్ష నిర్ణయాలకు అలవాటు పడిపోయారని, అదే నియంతృత్వ పోకడ అని, అంతటి నియంతృత్వం పాకిస్థాన్‌లో కూడా లేదని, అందుకే అయన అసంతోషంగా ఉన్నారని అంటున్నారు. మీరేమంటారు?

కెసిఆర్ : ఇగో...గాయనకు సంతోషమయితే నాకేంటి, దుఃఖమయితే నాకేంటి...పార్టీ క్రమశిక్షణను పాటించలేదు. మరందుకే గాయన్ను పార్టీల లేకుంట చేశిన. ముందుగాలే చెప్పిన. గాయన వినకుంట ఉన్నడు. ఎవ్వలు మీడియా ముందు మాట్లాడినా...తోలుతీస్తనని అన్నావా లేదా...మరా మాట విన్నడా...లే...మరి నేనెందుకూకుంట? పార్టీ అధ్యక్షుణ్ని కదా. నేనే ఊకుంటే మరేమన్నా ఉందా... గాయన... ఆ సంతోష్ రెడ్డనే మనిషి ఆగుతడా? ఎవ్వల మాటినకుండయితడు. అప్పుడింకా పార్టీ ఇజ్జత్ బజార్న పడతది కదా. అందుకే గాయన్ను నోరు మూయించనీకి ఆ క్రమశిక్షణా చర్య తీసుకుంటిని. దానికాయన పాకిస్థాన్ అని అంటున్నాడు. ఆయనకేం తెలుసు ఆ పాకిస్థాన్‌ల మా దంచుడు కంటే వీర దంచుడుంటది. గట్లా చేసినానా ఏమి. ముందాయన పార్టీ క్రమశిక్షణ పాటించమనండి.

వి మార్క్ : పార్టీ క్రమశిక్షణ పాటించే కదా...మీరు కేంద్ర మంత్రిపదవి అట్టేపెట్టుకున్నా ఇక్కడ రాష్ట్ర మంత్రిగా రాజీనామా చేశారు. మరి మీరెందుకు పదవులట్టే పెట్టుకున్నారనీ కూడా ఆయన అంటున్నారు.

కెసిఆర్ : మేమంటే ప్రత్యేక తెలంగాణా సాధించేందుకు రక్తాన్నయినా చిందిస్తామన్నామని, అందుకోసం ఎంత కష్టమైనా చేస్తామని అన్నాం. అలా కష్టపడేటందుకే కేంద్ర మంత్రిత్వ శాఖలో కొనసాగుతున్నాం.

వి మార్క్ : మంత్రి పదవుల్లో ఉండి ప్రత్యేక తెలంగాణా సాధనకోసం ఏం చేశారనీ సంతోష్‌రెడ్డిగారే కాదు తెలంగాణా మేధావులు కూడా అంటున్నారు కదా?

కెసిఆర్ : అక్కడుండబట్టే కదా ఎప్పుడుపడితే అప్పుడు సోనియా మేడమ్ గార్ని పదేపదే కలిసి పదేపదే వాగ్దానాలు పుచ్చుకోగలుగుతున్నాం.

బి తాళ్ : (కెమేరా వెనుకనుంచే) ఆ సోనీయాజీ మీకేమని హామీ ఇచ్చారో పార్టీలో ఎవ్వరికీ తెలియదు అని మీ అనుయాయుడైన సత్తెన్న కూడా అంటున్నారు కదామరి?

కెసిఆర్ : నాకు సోనియా మీద ఎంతో నమ్మకం.

వి మార్క్ : మీమీద మీ పార్టీవాళ్లలో కొందరికెంతో నమ్మకం.

బి తాళ్ : కానీ తెలంగాణా ప్రజలకే మీ మీద మీ పార్టీ మీద ఏ నమ్మకం లేదు.

"ఆఁ" అని ఆశ్చర్యపోయిన కేసీయారుడు పూర్తిగా తేరుకోకముందే బి తాళ్ భేతాళంగా, వి మార్క్ విక్రమార్కుడుగా యథా పపెట్ రూపానికొచ్చేశారు.

✣

తెంగ్లీష్

డా॥జె.పి.వైద్య

"వుయ్యార్రు... ఫ్రెండూ్స...!"

"అప్పులేనివాడె అధిక సంపన్నుడు
తప్పులేని వారు ధరణి లేరు
గొప్ప లేని బుద్ధి కొంచెమై పోవరా"

అని పద్యం రాసుకున్నారు తెలుగు సారు వారు.

ఇలాంటి నీతి పద్యాలు విన్నప్పుడల్లా మాకు కాస్త 'అనీజి'గా ఉంటుంది. నీతితో బతికే వాళ్లకు 'నీతి పద్యాలు' ఎందుకండీ?

సరే, ఎలాగూ చెప్పారు కదా...ఏదో విన్నట్టు నటించేసి తరువాత బాత్‌రూంలో చెవులు కడిగేసి వద్దాం అంటే అదీ చేయనీయకుండా 'జోర్రిగ' తీరు రెండు చెవుల్లో 'చెప్పీ చెప్పీ' ఎడిషన్‌ల మీద ఎడిషన్‌లా వాయించారు.

అందువల్ల ఏ బస్సన్నా ఎక్కి కొన్నాళ్లయినా తప్పించుకుందాం అన్న 'తయారీ'లో ఉన్నాం మేం కొంత మంది.

తీరా బస్సాండ్‌కొస్తే బస్సుల బంద్. ప్లాట్ ఫామ్ మీద ఉండకుండా 'సేఫ్‌జోన్'లో ఉంటే మంచిదనుకుని బస్టాండ్‌లో తచ్చాడుతూ తిరుగుతుంటే పోలీసోళ్లు పట్టుకున్నారు.

'ఏందిరా కొడకా? అప్పట్నించి చూస్తున్న! బిత్తిరి బిత్తిరి చూపుల్తోటి తిరుగుతున్నవ్? యాడికి పోవాలే బిడ్డా?' అని భుజం మీద చెయ్యేసి 'ప్రేమ'తో అడిగారు.

'జీవితంలో ఏమైనా చెయ్యి...కాని, పోలీసోళ్లతో స్నేహం మంచిది కాదు...శత్రుత్వం అంతకన్నా శ్రేయస్సు కాదు' అన్న నీతి పద్యాలు వినీ వినీ ఉన్నందున ఇంకా జాగ్రత్తలకు పోయి లేని పోని 'ఇక్కట్ల'లో పడ్డట్టయింది మాకు.

"అరే! వ్హేర్ గోయింగ్? ఆ! వ్హేర్ లగేజ్? వై లుకింగ్ కన్‌ఫ్యూజడ్? టెల్ రియల్ స్టోరీ? ఏ గ్రూపు?'

అన్నాడు భుజం పట్టి ఊపుతూ. ఆ రకమైన పదజాలప్రయోగంతో అది తెలంగాణా అన్నల ప్రాంతమని వేరే చెప్పాలా టెల్లండి!



సదరు తెలంగాణా పోలీసువారి భుజంమీది హేండిలింగ్‌కి ఏ కీలుకా కీలు వీడిపోయినట్టుంది.

కీలు గుర్రం సినిమాలోలా 'కీళ్లు' ఊడిపోయి ఉంటే గుర్రం ఎలా ఎగుర్తుంది? మాకు తెలంగాణా స్పెషల్ బెటాలియిన్ వారి నుండి తప్పించుకోవటమే మరీ గగనమైపోతుంటేనూ?

'మ..మ్మ..ప...ప్పా...' ఏది ముందు చెప్పాలో - ఎలా ప్రారంభించాలో మాకు అర్థం కాలేదు. మా వాళ్లు మరీ పిరికి డేరింగ్‌ఫెలోస్‌లేండి... సో...దట్ ఫెలోస్ జారుకునే ప్రయత్నం చేస్తున్నట్టు గమనించి పోలీసోళ్లు చుట్టుముట్టారు.

'వార్నీయవ్వ! ఫుల్ గ్రూప్ వాండంగ్ ఇన్‌ది ఓపెన్! మనం లక్కీ రోయ్ పిసీ ఫోర్‌నాట్ ఫైవ్ సుబ్రాయుడూ- నూ వాణ్ణి అందుకో! నేను వీణ్ణి ఇంటరాగేట్ చేస్తా...మిగతా వాళ్లను రౌండప్ చేసేయ్...పదవయ్యా మగడా...! కమాన్ వాక్! ఏందయ్యా గట్ల చూస్తవూ ? వాకవయ్యా వాక్! మేం మీ దోస్తులమే! ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్ ఈజ్ ఎ ఫ్రెండ్ ఇండీడ్! మేం అందరం 'ఇండీడ్ ఫ్రెండ్స్‌లమే'...ఏంటీ నో నమ్మకమ్స్...నాతో కమింగ్. డైరెక్ట్ స్టేషన్ కమింగ్ అండ్ సీయింగ్ అన్ ది బోర్డ్...యూ కెన్ లుక్కు..."మేము మీ మిత్రులము" అని రీడింగు...డెఫినెట్లీ యార్...పద బే..."

ఉదయం పూటే ఇదేం కష్టం రా బాబూ? అని మనస్సులో అనుకున్నాం...మా పెదవుల వణుకు చూసి ఆయన మళ్లీ అందుకున్నాడు..

"ఏందీ నాయనా! సీక్రెట్ కోడింగా...! బి కేర్‌ఫుల్...మాకూ ఉంటయి సీక్రెట్ కోడింగులూ...అపరేషన్ బ్లూస్టార్ విన్నారా? ఇలా రంగు రంగుల్లో ఉంటయి కోడింగులు...! నూ మొహం మీద కలర్లు మార్చి కోడింగులు చెయ్యకు...హూఁ! ఇప్పుడు చెప్పు! ఏమిటీ స్టోరీ? ఎవరు మీరు? ఏ గ్రూపు?

కొంపతీసి కోబ్రా గాళ్లయితే కారుగా...నర్సా, నల్లమలై త్రాచులైతే కారుగదా...మా కోబ్రా భయ్‌లయితే జరంత రెస్పెక్టీవ్వాలికదా మరి...ఎంతయినా మా కొలీగ్స్‌వేషాలే కదా...గట్లయితే లేరు గానీ... ఆ సంచిలో ఏముందీ? ఆఁ! కమాన్! బ్రింగ్ ఇట్ అండ్ ఓపెన్"

ఆ సంచిలో పాత పేపరు కటింగులున్నాయి...అవి చూసి ఇంకేం 'కోటింగ్' ఇస్తారో అని మేం మరీ ఇబ్బందిగా మొహాలు పెట్టాం...

''ఒహో! క్రీకెట్ డైరీలయిండొచ్చులే' అని వాళ్లేదో ఉత్సాహం ప్రదర్శించే వరకు మా వాడు భయంతో బ్యారుమన్నాడు....

'సార్! వేం పాములోల్లం కాదూ... ఏ 'గ్రూపు' వాళ్లం కాదు. మొన్నటి మున్సిపాలిటెలెక్షన్‌లో రకరకాల నాయకులు వచ్చి-'మాకే వోటెయ్యాలే' అని ప్రాణం పీకి పీకి చంపారు. మరిప్పుడు ఇంకేవో కొ ఆపరేటివ్ ఎన్నికలంటున్నారు. వాళ్ల 'లొల్లి' భరించలేక యాదన్న పోయి పాత పేపర్ల కటింగులైనా చదివి సుఖంగా ఉందాం అని పోతున్నం...ఫలానా చోటికి అని కాదు...ఏ బస్సు వచ్చి నిలపడితే అదెక్కుడే...కానీ ఆ బస్సులు బందంటున్నారు. ఇదీ సార్ మా సంగతి..నేను జిందగీల అబద్దాలు చెప్తే ఒట్టు...నిజం చెప్తే మీరు తంతరు అని 'కాక' నీతి వాక్యాలు చెప్పిండు..అందుకోసం భయపడ్డం...' అనేసాడు...

వాళ్లు గలగలా నవ్వుతారేమో అనుకున్నాం...

సీరియస్‌గా చూసి...ఆ తరువాత ఒకరి మొహం మరొకరు నింపాదిగా చూసుకున్నారు. తాము అన్నలం కానందుకు, రాబోయే రివార్డేదో ఆ విధంగా తప్పిపోయినట్లనిపించి, మా మీద ఎక్కడ్లేని చెడ్డ చిరాకొచ్చేసుంటుంది. గయ్‌మనబోయాడు. ఇంతలో మరో కానిస్టేబులేశ్వరుడు, "ఎక్స్‌పైర్డ్ వెడ్ సన్‌కి వచ్చిందే దవురీ" అనే థీయరీతో ముందుకొచ్చాడు.

"అరె భయ్ ఎందుకలా పరేషాన్ అవుతారు. వుయ్ ముందే టెల్లింగ్‌కదా...మేం మీ మిత్రులమనీ...ఎంతుంది మీ వేల్యుబుల్ పాకెట్‌ల్లో..." అనేస్తూ మా జేబులల్లో అచ్చం మా అవులాపురం బామ్మర్దిలా చేతులు పెట్టేసి కెలికేసి దొరకపుచ్చుకున్న చిల్లరంతా నూకేసారండీ...అదండీ ఇస్టోరీ...! ✝



ఓ ఊరి కథ

హెచ్. రమేష్ బాబు

ఏడు గ్రామాల కలయిక "వట్టెం"

నాగోలుసీమలో 12వ శతాబ్దానికి పూర్వమే వట్టెం గ్రామముండేదని చారిత్రకారులు తేల్చారు. ఇది లింగాపురం, మంగమ్మగడ్డ, నాగన్నగడ్డ, ఈదమ్మగడ్డ, ఉడుతలగడ్డ, పెరుమాండ్ల అనే ఏడుగ్రామాల కలయికతో ఏర్పడిందట. పూర్వం ఈ గ్రామాన్ని, బిజినేపల్లిని కలిపి ఆదిరాజు అనే చోళరాజు పాలించారని చారిత్రక పరిశోధకులు చెబుతారు.

ఈ వట్టెం ప్రస్తుతం వనపర్తి–నాగర్‌కర్నూల్‌ల నుండి హైదరాబాదు కెళ్లేదారిలో జడ్చర్లకు ఈవల ప్రధాన రహదారిపై ఉంది. నాగర్‌కర్నూల్‌కు సంబంధించిన తొలి ప్రభుత్వ అతిథిగృహం ఈ గ్రామంలోనే నిర్మించారు. దీని వలన నైజాంకాలంలో ఏ అధికారి వచ్చినా ఇక్కడే బసచేసేవారు. ఆ కాలంలో రెవెన్యూ వసూళ్లన్నింటికీ ఇది వసూలు కేంద్రంగా ఉండేది. ఆ రోజుల్లో భూమిపన్నును 'వట్టం" అనేవారు. దాంతో ఈ ఊరికే "వట్టెం"గా పేరొచ్చింది. నైజాం పాలనాకాలంలో ఈ గ్రామం అధిక జనసందోహంతో ఉండేది. ఇక్కడ గొప్పగొప్ప చేనేత కళాకారులుండేవారు. వట్టెంకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోపాలపేట సంస్థానానికి చెందిన కార్యకలాపాలు ఇక్కడే సాగేవి.

నిజాం వ్యతిరేక పోరాటంలోనూ ఈ వట్టెం తన పాత్రను పోషించింది. 1942లో బిరుదు వేంకట శేషయ్య తొలి గ్రంథాలయాన్నిక్కడ నెలకొల్పారు. 1947లో స్వాతంత్ర్యానంతరం రామానందతీర్థ ఈ గ్రామానికొచ్చారు. ఆ తరువాత జమలాపురం కేశవరావు ఇక్కడేర్పాటుచేసిన సభల్లో పాల్గొన్నారు. ఈ గ్రామానికి సమీపంలో కొండలపై వెంకటేశ్వరుని ఆలయముంది. దీని నిర్మాణానికి కృషిచేసిన వారిలో రంగారెడ్డి అనే ఇంజనీరు ప్రధానపాత్ర వహించారు.

ఈ ఆలయానికి మరోవైపున ఖాళీగా ఉన్న ప్రదేశాన్ని సమతలం చేసి జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటుకు ఈయన కృషి చేశారు. 1994 సెప్టెంబర్ 13న నవోదయ పాఠశాల ప్రారంభమైంది. 2002 జనవరి 6న వట్టెంను బ్రిటన్ ప్రధాని టోనీబ్లేయర్ సందర్శించడంతో ఈ ఊరు ఒక్కసారిగా జాతీయస్థాయిలో ప్రధానాకర్షణగా నిలిచింది.

✣

వట్టెం గ్రామం అభివృద్ధికి నిదర్శనం ఈ నవోదయ విద్యాలయం

పాఠం బాగా వచ్చిందే....!

టీచర్ పాఠం చెప్పడం ముగించాక "పిల్లలూ ! విమానం, ఆవు, రైలు, గుర్రం అనే వ్యాసాలు చదువుకు రండి రేపు అడుగుతాను" అని చెప్పాడు.

బద్ధకస్తుడైన నవీన్ ఈజీగా ఉందని ఒక ఆవు వ్యాసం మాత్రమే చదువుకెళ్ళాడు.

"విమానం గురించి చెప్పు" టీచర్ అడిగారు.

"విమానం గాలిలో ప్రయాణిస్తుంది కిటికీ దగ్గర కూర్చుంటే కింద గడ్డి మేస్తున్న ఆవు కనిపిస్తుంది. ఆవు తెల్లగా ఉంటుంది. గడ్డి మేస్తుంది. పాలు ఇస్తుంది అంబా అని అరుస్తుంది. బండి లాగుతుంది. పొలం దున్నుతుంది" అంటూ చెప్పుకుపోసాగాడు నవీన్.

'ఆపాపు. అదంతా తప్పు రైలు గురించి చెప్పు! అన్నారు టీచర్.

'రైలు పట్టాల మీద వేగంగా ప్రయాణిస్తుంది. పరుగెత్తుతున్న రైల్లోంచి చూస్తే బయట గడ్డిమేస్తున్న ఆవు కనిపిస్తుంది. ఆవు తెల్లగా ఉంటుంది. తెల్లని పాలను ఇస్తుంది. అంబా అని అరుస్తుంది. బండి లాగుతుంది. ఇంకా ..." చెప్పుకుపోతున్న నవీన్‌ను వారించింది టీచర్.

"ఇదీ తప్పే ! గుర్రం గురించి చెప్పు" అన్నాడు.

"గుర్రం మీద స్వారీ చేస్తూ పోతుంటే గడ్డి మేస్తున్న ఆవు కనిపిస్తుంది ఆవు తెల్లగా ఉంటుంది. తెల్లని పాలను ఇస్తుంది.....

- పెండెం జగదీశ్వర్

గస్టో బిస్ట్రో

ధనికుల విందులు వినోదాలు ఎప్పుడైనా చూశారా ! కొందరు చూసే ఉంటారు. స్టార్ హోటళ్లలో ఇడ్లీ రు.50, భోజనం రు 500 గురించి ఎప్పుడైనా ఎవరైనా చెప్పుకుంటుంటే అయినా విని ఉంటారు. ఎందుకు ఇంత ధర అనుకుంటే సమాధానం ఒక్కటే. తినేదాని కంటే వృధా చేసేది ఎక్కువ. అందువలన దాని కయ్యే ఖర్చు కూడా చెల్లించాల్సి ఉంటుంది మరి. మరి కొన్ని ఇతర కారణాలు కూడా ఉంటాయి.

ఫ్రెంచి వారు భోజన ప్రియులు. అత్యంత విలాసవంతమైన విందులో 20కిపైగా పదార్థాలుంటాయి. అది గతం కింద మారిపోయింది. ఇప్పటి ఫ్యాషన్ మితంగా తినటం, జేబు బరువును బట్టి పరిమితం చేసుకోవటం. దాన్నే 'గస్టో బిస్ట్రో' అంటున్నారు. దాని ధర కేవలం 30 యూరోలు మాత్రమే. మన రూపాయల్లో అయితే రెండు వందలకు పైమాటే సుమా ! దర్శన్ లేదా టిఫిన్ సెంటర్ల వంటివని చెబితే మనకు బాగా అర్థం అవుతుందేమో. మనకు మల్లే భోజనం చేస్తూ హైదరాబాద్ నుండి విశాఖపట్టణానికి వినపడేలా సెల్‌ఫోన్‌లో మాట్లాడితే అక్కడ పరువు తక్కువ. గస్టో బిస్ట్రో టేబుళ్ల దగ్గర ఇప్పుడు గుసగుసల స్వరం కొంచెం పెంచినా తప్పుకాదట. భోజనం చేస్తూ పంతులుగారి ముందు పాఠం వినే పిల్లాడిలా బిక్కచచ్చి తినటం కాకుండా జోకులేసుకుంటూ పగలబడి నవ్వుకుంటూ తింటే ఎంత మజా ఉంటుందో అనుకునే వారు పెరిగిపోయి గస్టో బిస్ట్రోలకు రావటం ఎక్కువైందట. దీన్నే మరింత స్వేచ్ఛగా భోజనం చేయటం అని వర్ణిస్తున్నారు. పారిస్‌లో కేవలం 30 యూరోలకే భోజనం పెట్టే సెంటర్లు వందలకొద్దీ వెలిశాయి. కేవలం అరడజను పదార్థాలు మాత్రమే ఉంటాయి. వాటిలో ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. దీని వలన నలభీములకు ఎంతో వెసులుబాటు కలిగిందట. అంతేకాదు రోజూ కొత్త వంటకాలను చేరుస్తూ ఉంటే భోజనప్రియులను కట్టడి చేయవచ్చనీ తేలింది. అంతే కాదు స్టార్ హోటళ్ల వంటగాళ్లకంటే తామేం తీసిపోలేదని గస్టోబిస్ట్రో వంటగాళ్లు రుజువు చేసుకున్నారు. వంటంటే ఇలాగే ఉండాలని చెప్పేవారు మనం కూడా ఇక మారకతప్పదు అని నిట్టూర్పు విడుస్తున్నారట. ఇంతకీ ఈ మార్పు ఎందుకొచ్చిందంటారూ ! మన కాఫీ హోటళ్లలో కాఫీ, టీ ఫుల్ నుండి సింగిల్‌కు ఎందుకు మారామో అందుకే అని చెప్పనవసరం లేదేమో ?

- ఎంకెఆర్

అవీ... ఇవీ

<u>డాక్టర్ పిండేశ్వరరావు:</u> ఆపరేషన్ సక్సెస్ అయితే ఒక చిన్న చిక్కొచ్చి పడిందయ్యా. నీకేం కాకుండా ఉండాలంటే మరోసారి ఆపరేషన్ చేయకతప్పదు.

<u>పేషెంట్ బక్కస్వామి :</u> (ఆపరేషన్ పేరుతో భారీ మొత్తం వసూలు చేసిన డాక్టర్ సక్సెస్ అనగానే సంతోషపడినా మరో ఆపరేషన్ అనగానే ఆదుర్దాపడ్డాడు. తన దగ్గర ఇంకేమాత్రం డబ్బులేదన్న విషయాన్ని మదిలో ఉంచుకొని) ఏమైంది సార్.

<u>డాక్టర్ పిండేశ్వరరావు :</u> నీకేం కాలేదు. నా చేతి తొడుగులు లోపల వేసి కుట్లు వేశా అంతే వాటిని తీయాలి.

<u>పేషెంట్ బక్కస్వామి :</u> అవే అయితే ఫర్లేదు సార్, కత్తులు కాదు కదా, తొడుగులెంతో చెప్పండి బిల్లు పే చేస్తా.

ఈశ్వర్, హైదరాబాద్

పరదేశి

దాహమేసి
మన చెరువులో తాగబోతే
మనల్ని అడ్డుకొని
వాడెవడికో నీళ్లిచ్చాడు
మన కాపలావాడు.....
మన నీళ్ళను
వాడి సీసాలో పోసుకొచ్చి
ఇపుడు మనకే అమ్ముతున్నాడు !

- రావి రంగారావు

కాలానికి
ఎంత
పరుగో...
అయితే
అది
మన
చేతిలో,
మన
చేతల్లో
ఉండాలి.



విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

అంతరిక్షంలో మరో అరుణ పతాక



గతవారం చైనా వ్యోమగాములిద్దరు అయిదు రోజుల అంతరిక్ష యాత్ర ముగించుకుని భూమికి తిరిగి రావడంతో చైనా అంతరిక్ష కార్యక్రమంలో ఒక ముఖ్యమైన మైలురాయి దాటింది. ఇప్పుడది మరిన్ని అంతరిక్ష విజయాలవైపు చూస్తోంది. అంతరిక్షాన్ని జయించేందుకు రానున్న పదేళ్లలో చేయబోయే కార్యక్రమాలను గురించి చైనా ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసుకుంది. నిజానికి పదేళ్లకే కాదు ప్రస్తుత శతాబ్దంలో అంతరిక్షంలో తాను చేయాల్సిన పనులను గురించి చైనా పకడ్బందీగా ముందుకెళుతోందని దాని కార్యక్రమాలు చూస్తే తెలుస్తుంది. మచ్చుకు కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు ఇలా ఉన్నాయి:

- వచ్చే సంవత్సరం(2006)లో చైనా వ్యోమగాములు తొలిసారిగా అంతరిక్షంలో నడుస్తారు. ఆ విధంగా వారు అంతరిక్షంలో వ్యోమనౌకల మరమ్మతులకు, అంతరిక్షనౌకల అనుసంధానం (డాకింగ్)కు కావలసిన నైపుణ్యం సాధిస్తారు.
- 2007లో చైనా తొలి మహిళా వ్యోమగామిని అంతరిక్షంలోకి పంపుతుంది. దీని కోసం మహిళలకు శిక్షణనిచ్చేందుకు ఇప్పటినుండే వెదుకులాట ప్రారంభించారు. ఇప్పటివరకు చైనా అంతరిక్ష కార్యక్రమంలో వ్యోమగామి శిక్షణ పొందుతున్నవారిలో పురుషులు మాత్రమే ఉన్నారు. ఇప్పుడు మహిళల కోసం అన్వేషణ ప్రారంభించినట్లు చైనా అంతరిక్ష ఇంజినీరింగ్ కార్యాలయం డైరెక్టర్ టాంగ్ జియాన్‌మింగ్ చెప్పారు.
- వచ్చే ఏడాది నాటికి చంద్రమండలాన్ని పరిశోధించే ఒక ఉపగ్రహాన్ని చైనా ప్రయోగించనుంది. 2003లోనే ఈ విషయాన్ని చైనా అధికారికంగా ప్రకటించింది. భవిష్యత్తులో చంద్రమండల యాత్రలకు ఈ పరిశోధన తోడ్పడుతుంది.
- 2010 నాటికి చంద్రమండలంపైకి మానవ రహిత వ్యోమనౌకను పంపాలని ప్రణాళిక సిద్ధం చేసింది.
- 2020 నాటికి చైనా పంపే వ్యోమ నౌక చంద్రమండలంపై దిగి అక్కడి మట్టిని సేకరించి భూమి మీదికి వస్తుంది. భవిష్యత్తులో ఆ దేశం చంద్రమండలంపైకి మానవులను పంపడానికి ఈ వ్యోమయాత్ర మార్గాన్ని సుగమం చేస్తుంది.

చైనా నాయకులు 1990వ దశకం ప్రారంభంలోనే రానున్న మూడు దశాబ్దాల కార్యక్రమాన్ని రూపొందించుకుని ఒక పద్ధతి ప్రకారం పనిచేస్తున్నారు. 1992 ఆగస్టు 1న చైనా అంతరిక్ష పరిశోధనా అకాడమీ సమావేశానికి నాటి చైనా ప్రధాని లీ పెంగ్ హాజరైనారు. ఆయన సమక్షంలో మూడు దశల చైనా అంతరిక్ష కార్యక్రమాన్ని ప్రకటించారు.

మొదటి దశ: 1992 నుండి 2002వ సంవత్సరం వరకు. ఈ దశలో రెండు మానవరహిత వ్యోమనౌకలు అంతరిక్షంలోకి పంపి తదుపరి 2002లో తొలి చైనీయుని అంతరిక్షంలోకి పంపాలి. ఈ కార్యక్రమం దాదాపు అనుకున్నట్లే అయింది. 2003 అక్టోబర్‌లో చైనా తొలి వ్యోమగామిని అంతరిక్షంలోకి పంపింది.

రెండవదశ: 2002 నుండి 2007 వరకు. ఈ దశలో అనేక అంతరిక్ష నౌకలను పంపుతుంది. అంతరిక్షంలో నడక, డాకింగ్ నిర్వహిస్తుంది. 8 టన్నుల అంతరిక్ష లాబొరేటరీని నెలకొల్పుతుంది.

మూదవదశ: 2007 నుండి 2015 వరకు. ఈ దశలో 20 టన్నుల అంతరిక్ష కేంద్రాన్ని కక్ష్యలో ప్రవేశపెడుతుంది. 8 టన్నుల వ్యోమనౌకలో వ్యోమగాములు నిరంతరం భూమినుండి ఈ అంతరిక్ష కేంద్రానికి ప్రయాణాలు చేస్తారు.

అంతరిక్షాన ఇరవయ్యొకటో శతాబ్దం

అంతరిక్ష రంగానికి సంబంధించి 21వ శతాబ్దం విచిత్రంగా ప్రారంభమైంది. ఒకప్పుడు అంతరిక్షంలో పోటీలు పడి విజయాలు సాధించిన రెండు దేశాలు-అమెరికా, రష్యా- ఈ శతాబ్దంలో ఈ రంగంలో అనేక కష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఆర్థికంగా చితికిపోయిన రష్యా తన అంతరిక్ష కేంద్రం మీర్‌ను నిర్వహించలేక కూల్చి వేసింది. అమెరికా స్పేస్ షటిల్ కొలంబియా భూమికి దిగివస్తూ కూలిపోయింది. దాంతో అది తన షటిల్ ప్రయాణాలను మూడేళ్లు వాయిదా వేసుకుని మళ్లీ ఈ సంవత్సరమే ప్రారంభించింది. అయినప్పటికీ అమెరికా షటిల్ సర్వీసులు గతంలో లాగా నడుస్తాయన్నది అనుమానంగానే ఉంది. ఒకప్పుడు అంతరిక్షంలో తిరుగులేని విజయపరంపరలు సాధించిన ఈ రెండు దేశాలూ నేడు తమ రెండు దేశాల స్తోమతను కలిపిచేర్చితేనే ఒక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని నిర్వహించగలుగుతున్నాయి. ఈ కేంద్రంలో రష్యా వ్యోమగాములు నిరంతరం పరిశోధనలు చేస్తుంటే, అమెరికన్లు, ఇతర దేశాల వ్యోమగాములు అప్పుడప్పుడు వెళ్లి వస్తున్నారు.

ఈ రెండు దేశాల పరిస్థితి ఇలా ఉండగా 21వ శతాబ్దాన్ని చైనా అంతరిక్షంలో విజయపరంపరలతో ప్రారంభించింది. 2003 అక్టోబర్‌లో చైనా తొలి వ్యోమగామి యాంగ్ లీవి షెన్‌ఝూ-5 వ్యోమనౌకలో భూమిచుట్టూ తిరిగి వచ్చి అంతరిక్షంలో చైనా పతాకను ఎగురవేశాడు. ఆ విధంగా చైనా అంతరిక్షాన్ని జయించిన దేశంగా అమెరికా, రష్యాల సరసన చేరింది. విశేషమేమిటంటే అంతరిక్షంలో ఇప్పటివరకు ఎగిరిన మూడు దేశాల పతాకాల్లో రెండు అరుణ పతాకాలే. నాటి సోషలిస్టు సోవియట్ అంతరిక్షంలో తొలిసారి అరుణ పతాక ఎగురవేయగా నేడు సోషలిస్టు చైనా దాని బాటలో ముందుపోతోంది. అయితే అమెరికా, రష్యా అంతరిక్ష కార్యక్రమాలతో పోలిస్తే చైనా ఇంకా చాలా వెనుకబడే ఉంది. వాటి స్థాయిని అందుకోడానికి అది ఉరకలు వేస్తోంది. గత వారం చైనా వ్యోమగాములు ఫీ జున్‌లాంగ్ (40), నీ హాయ్‌షెంగ్ (41)లు షెన్‌ఝూ-6 వ్యోమనౌకలో అయిదు రోజులు అంతరిక్షంలో ప్రయాణించి గత సోమవారం నాడు సురక్షితంగా భూమికి తిరిగి వచ్చారు. దీంతో ఇప్పటివరకు ముగ్గురు చైనీయులు అంతరిక్షంలో అడుగుపెట్టినట్లయింది.

చైనా అంతరిక్ష కార్యక్రమంలో చాలా ఆసక్తికరమైన విషయాలున్నాయి. దాని వ్యోమనౌకలకు 'షెన్ ఝూ' అని పేరు పెట్టారు. వాటిని అంతరిక్షంలోకి తీసుకుపోయే రాకెట్లకు 'లాంగ్ మార్చ్' అని పేరుపెట్టారు. మావో నాయకత్వంలో కమ్యూనిస్టు ఎర్ర సైన్యం చైనా ఉత్తర ప్రాంతం నుండి దక్షిణానికి సుదీర్ఘమైన లాంగ్ మార్చ్ జరిపి దేశాన్ని భూస్వామ్య బంధనాలనుండి, విదేశీ పాలననుండి విముక్తి గావించారు. నాటినుండి కమ్యూనిస్టుల నాయకత్వంలో విప్లవ విజయానికి లాంగ్ మార్చ్ ఒక చిహ్నంగా మారింది. చైనా వ్యోమగాములను 'టైకోనాట్స్' అంటున్నారు. అమెరికా తన వ్యోమగాములను 'ఆస్ట్రోనాట్స్' అని పిలుస్తుండగా రష్యా వ్యోమగాములను 'కాస్మోనాట్స్' అన్నారు. అమెరికన్లు, రష్యన్లు ఎవరి భాషా సంస్కృతులను బట్టి వారు తమ వ్యోమగాములకు, వ్యోమనౌకలకు, అంతరిక్ష కేంద్రాలకు పేర్లు పెట్టుకున్నారు. ఇప్పుడు చైనా వంతు వచ్చింది కాబట్టి అది కూడా సైన్సు-సాంకేతిక పరిజ్ఞానంతో బాటు తన భాషా సంస్కృతులను కూడా అంతరిక్షానికి తీసుకుపోతోంది. విజయం సాధించిన వారి సంస్కృతే చెల్లుబాటవుతుందంటారు ఇదేనేమో. ✢

కొత్త పుస్తకాలు

ప్రపంచవిలన్ హిట్లర్

చరిత్రలో నియంత అనే పదం, దాని గుణానికి మించిన ఎన్నో రెట్ల దుర్మార్గ చరిత్ర మూటగట్టుకున్న వాడు నాజీ హిట్లర్. హిట్లర్ దుర్మార్గుడు, పచ్చి నియంత, నరహంతకుడు అని పదాల వర్ణనలతో ఎంతైనా వర్ణించొచ్చు. కానీ చారిత్రక సంఘటనలతో, ఆయా సంఘటనల రాజకీయ సామాజిక విశ్లేషణలతో రాసిన ఉద్గ్రంథం విలియమ్ ఎల్ షీరర్ రాశారు. అది 1486 పేజీల భారీ పుస్తకం. ఒక చరిత్రకారుడుగా కాక ఒక పాత్రికేయుడిగా చదివించే లక్షణంతో చక్కగా రాశారు. దానిని మరో పాత్రికేయ రచయత అయిన రావెల సాంబశివరావు సరళమైన తెలుగులో సంక్షిప్తానువాదం చేశారు. దీన్ని రెండు భాగాలుగా ప్రజాశక్తి ప్రచురించింది. దాని రెండవ భాగం ఈ "నాజీ హిట్లర్" ద్వితీయ భాగం, ఫాసిజపు యుద్ధోన్మాదం-పతనం. కేవలం డెబ్భై పేజీలలోనే హిట్లర్ గురించి అతని సామ్రాజ్యకాంక్ష గురించి విలియం ఎల్ షీరర్ ఆగ్రహాన్ని ఎంతగానో నిబిడీకరించారు.

నాజీ హిట్లర్
ద్వితీయ భాగం
ఫాసీజపు యుద్ధోన్మాదం-పతనం
వెల 30/-, పేజీలు 74.
ప్రతులకు
ప్రజాశక్తి బుక్ హౌస్, చిక్కడపల్లి, హైదరాబాద్.
అన్ని బ్రాంచీలలో దొరుకును

ఈ రెండవ భాగంలో "యుద్ధానికి తొలిమెట్లు" అనే విభాగం ద్వారా 1934-1937ల నాటి ఫ్రెంచి దేశపు రైన్ ల్యాండ్‌పై గెలిచిన గెలుపు నుంచి మొదలెట్టి 1945 మే 10వ తేదీన హిట్లర్ తన పిస్టల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న వరకూ నాజీచరిత్రకు అద్దం ఈ పుస్తకం. దీనిని ఇంత సరళంగా, అంతకు మించి చదివించే ఉత్కంఠతతో ఈ పుస్తకం అందరినీ ఆకర్షిస్తుంది. ప్రతిఒక్కరూ చదవాల్సిన పుస్తకం. ఈ పుస్తక అనువాదకులు మనసావాచా కోరుకున్నట్లుగా నూటికినూరుపాళ్లూ ఆయన కృషి ఫలిస్తుందని చెప్పొచ్చు. అనువాదకుడు కోరుకున్నట్లు ఈ పుస్తకం చదివితే యుద్ధోన్మాదపు ప్రమాదాలనూ శాంతియుత జీవనంలోని ప్రయోజనాలనూ ప్రగాఢంగా గుర్తించగల్గుతారు. హిట్లర్‌లాంటి వారిలోని నియంతృత్వపుపోకడల్లోని కర్కశత్వాన్ని, ప్రజాస్వామిక విలువల్లోని గొప్పతనాన్నీ చాలా సులువుగా అవగాహన చేసుకోగల్గుతారు.

- శంకర్



బహుజన వాదం
తాళ్లూరి లాబన్‌బాబు
వెల : 60/-, పేజీలు : 135
ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌస్,
విశాలాంధ్ర బుక్ హౌస్
అన్ని బ్రాంచీలలో దొరుకును

తరువోజ
పద్య సంకలనం
ప్రకాశం జిల్లా రచయితల సంఘం
వెల 150/-
పేజీలు : 157
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలలో దొరుకును.



కెరటాల భాష

ఈ కవిత్వం "పాదాల్ని తాకి, పాదాల కింద నుంచి ఇసుక లాక్కుపోయిన సముద్ర కెరటాల్లా" ఉంటుంది. జీవితాల్ని చుట్టేసుకున్న యాంత్రికత నెమ్మదిగా కవిత్వానికీ చేరుతున్న ఈ రోజుల్లో, కొత్తదనం కోసం ఎదురు చూసే వార్ని నిరాశపర్చని విధంగా ఉంది. షహనాజ్ కవిత్వంలో నిశ్శబ్దం ఉంది. అంతకు మించి గుండెలకి తగిలే శబ్దమూ ఉంది అంటారు 'జింబో'. ఈ పుస్తకానికి జీవితం గంభీరజ్ఞాపకమంటూ ముందుమాటగా రాశారాయన. సరిగ్గా అలానే జీవితంలోని చేదు జ్ఞాపకాలు నిశ్శబ్దంగా స్పృశిస్తాయి ఈ కవితలు. 'జ్ఞాపకం' శీర్షికలో "అత్తి పత్తిని తాకిన అలోక స్పర్శ", "మదిలోకి జారి ఇంకిన వెన్నెల", "దీర్ఘ విస్మృతిలో మృదువైన మేల్కొలుపు", "మబ్బు కురుల్లో దోబూచులాడిన వెలుగు చీకటి" ఇలా నెమ్మదిగా ఆలోచిస్తే ఒక్కొక్క జ్ఞాపకాన్నీ...ఒక్కొక్క సంఘటనతో కలిపి మరీ చూపిస్తుందీ విభజన. అది ఈ సంకలనం ప్రత్యేకత. అలాంటిదే ఒక కవిత్వాన్ని చూద్దాం. శీర్షిక పేరు పునాది. "బాల్యం-తిరిగి రాని కాలానికి కొలమానం", "బాల్యం -హృదయపు ఆల్చిప్పలో అపురూప ముత్యం", "బతుకు భవనపు పునాది-బాల్యం" ఈ వాక్యాల్ని విడిగా చదివితే, మినీ కవితల్లా ఉంటాయి. 30 కవితలు గల ఈ సంకలనంలోని మరో ఆణిముత్యాన్ని ప్రస్తావించుకుందాం!"రాతి చువ్వల్ల రాలి పూసిన ఎన్ని చినుకు పువ్వులో చినుకు తగిలి విచ్చుకునే ఎన్ని విత్తిన బ్రతుకులో" భాషతోపాటు భావమూ సరితూగేలా ఉన్నాయి. వాటిని కవిత్వీకరించడం గొప్ప విషయం "ఉదయం వచ్చి నన్ను ఊపేసి నా ఏకాంతంలో అల్లరిగా ఆడుకుంటుంది", "సంధ్య నన్ను సాధించి ఏకాకిని చేస్తుంది", "ఇద్దరూ తనకు మిత్రులే, ఇద్దరూ తనకు శత్రువులే" అంటారు రచయిత. ఒకటి రెండుకవితలు రచయిత్రి మరింత శ్రద్ధ తీసుకుని రాస్తే బాగుండేది అనిపించేలా ఉన్నాయి. "రోదసీలో అనునిత్యం రహస్యాలకై అన్వేషిస్తున్నాం."చంద్ర మండలంలో ఇండ్లను కట్టేస్తున్నాం."ప్రగతి ప్రధాన పయనిస్తున్నాం" ఇంత వరకూ బాగుంది. "మన విశ్వాన్నే అణ్వస్త్రాలతో మరుభూమిగా మార్చేస్తున్నాం" అన్న వాక్యం రచయిత్రి చెప్పదల్చుకున్న విషయానికి భిన్నంగా ఉంది. మరెన్నో సాధించాం మానవత్వాన్నే మరుస్తున్నాం అనేది అసలు విషయం. అదే ఎత్తుగడలలో మొదటి కవిత, మనం మనుష్యులం మనకి అన్ని రకాల పువ్వులు కావాలి అన్ని రకాల రుజువులు కావాలి" అన్ని రకాల అనుభూతులు కావాలి" అన్నీ కావాలి ఒక్క మానవత్వం తప్ప ! ఈ కవిత్వంలో కవిత్వం కనిపిస్తుంది. గుండె-ముళ్ళు గుర్తులేదు "నవ్వడం నేర్చుకో" లాంటి మంచి కవితలలో ఈ సంకలనం పాఠకుల్ని అలరిస్తుందనడంలో సందేహం లేదు.

కెరటాలు
షహనాజ్ ఫాతిమా
వెల 30/-
పేజీలు 44
అన్ని ప్రముఖ విక్రయ కేంద్రాలలో దొరుకును.

- బుర్రా సాయిబాబు

సెవెన్ కప్స్ స్వీట్

కావలసిన వస్తువులు

శనగపిండి	:	ఒక కప్పు
కొబ్బరి కోరు	:	ఒక కప్పు
నెయ్యి	:	ఒక కప్పు
పాలు	:	ఒక కప్పు
పంచదార	:	మూడు కప్పులు

తయారుచేసే విధానం

శనగపిండిని శుభ్రంగా జల్లించుకోవాలి. పాలు బాగా మరిగించినవి ఒక కప్పు తీసుకోవాలి. అడుగు మందంగా ఉన్న గిన్నెను తీసుకొని పై పదార్థాలన్నింటినీ కలిపి పొయ్యి మీద పెట్టాలి. పంచదార కరిగిన తరువాత సన్న సెగ మీద ఉంచి అడుగు అంటకుండా తిప్పుతూ ఉండాలి. అవన్నీ బాగా ఉడికిన తరువాత స్వీట్ తెల్లని నురగ వస్తుంది. అంటే అది గిన్నెకు అంటకుండా వదిలి ఉంటుంది. అప్పుడు ఓ పళ్ళానికి నెయ్యి రాసి అందులో ఈ మిశ్రమాన్ని పోయాలి. సమానంగా చేసి మనకు నచ్చిన ఆకారంలో కట్ చేసుకోవాలి. ఈ స్వీట్‌ను తయారు చేయడం చాలా సులభం. అర్జెంట్‌గా స్వీట్ చేయాలనుకున్నప్పుడు దీనిని ప్రయత్నించవచ్చు.

రుచి

బియ్యం రవ్వ, కొబ్బరి పాయసం

కావలసిన వస్తువులు

బియ్యం	:	పావు కిలో
కొబ్బరి చిప్ప	:	ఒకటి (పచ్చిది)
పాలు	:	ఒక లీటరు
యాలకులు	:	ఐదు
జీడిపప్పు	:	పది గ్రాములు
బాదం	:	పది గ్రాములు
బెల్లం	:	పావు కిలో
పంచదార	:	చారెడు
నెయ్యి	:	ఒక స్పూన్
సగ్గుబియ్యం	:	50 గ్రాములు (సన్నటివి)
పచ్చ కర్పూరం	:	చిటికెడు

తయారుచేసే విధానం

బియ్యం కడిగి మిక్సీలో సన్నని రవ్వగా పట్టుకోవాలి. రవ్వను గ్లాసుతో కొలిచి అన్నే నీళ్ళు ఎసరు పెట్టాలి. నీరు మరిగిన తరువాత రవ్వపోసి ఉప్మాలా దగ్గరకు వచ్చిన తరువాత దించాలి. జీడిపప్పు, బాదం పప్పును ముందుగానే నానబెట్టుకోవాలి. బాదం పొట్టు వలిచి జీడిపప్పు, బాదం పప్పును సన్నగా ముక్కలుగా కోయాలి. వీటిని నేతిలో దోరగా వేయించాలి. మిగిలిన నెయ్యిలో సగ్గుబియ్యం వేయించాలి. అవి తెల్లగా పొంగుతాయి. పాలు బాగా మరిగిన తరువాత రవ్వ ఉప్మాను కొంచెం పాలుపోసి పల్చగా ఉండలు లేకుండా కలిపి మరుగుతున్న పాలలో పోయాలి. రెండు నిముషాలు ఆగి సగ్గుబియ్యం వేయాలి. రవ్వ ఉడికి దగ్గరగా అవుతున్నప్పుడు కొబ్బరి వేసి ఒక ఉడుకు ఉడకనిచ్చి బెల్లం, పంచదార, యాలకుల పొడి, పప్పులు అన్నీ వేసి కలపాలి. ఇది వేడిగా తిన్నా బాగుంటుంది. ఫ్రిజ్‌లో పెట్టుకొని తిన్నా బాగుంటుంది.

కలంస్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండి. మరి మా అడ్రస్: కలం స్నేహం, **బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.**

పేరు : ఎన్.శశిధర్
వయసు : 10 సం॥
చదువు : 4వ తరగతి
హాబీలు: పుస్తకాలు చదవడం అంటే ఇష్టం
లక్ష్యం : ఇంజనీర్ కావడం
చిరునామా : ఎన్.శశిధర్, సన్నాఫ్ ఎన్.మధు, శాంతినగర్, మెయిన్‌రోడ్డు, వడ్డేపల్లి మండలం, అల్లంపూర్ తాలూకా, మహబూబ్‌నగర్.

పేరు : జె.మానస
వయసు : 9 సం॥
చదువు : 3వ తరగతి
స్కూలు : కేంద్రీయ విద్యానికేతన్
లక్ష్యం : కలెక్టర్ కావడం
హాబీలు: పాటలు పాడడం, డ్రాయింగ్ వేయడం, చదువుకోవడం
చిరునామా: జె.మానస, డాటరాఫ్ జె.బసవయ్య, తెలికాంనగర్, నంద్యాల రోడ్, కర్నూలు- 518002.

పేరు : జె.రవితేజ
వయసు : 7 సం॥
చదువు : 1వ తరగతి
స్కూలు : కేంద్రీయ విద్యానికేతన్
లక్ష్యం : పోలీస్ ఆఫీసర్ కావడం
హాబీలు: ఆటలు ఆడడం, బొమ్మలేయడం
చిరునామా : జె.రవితేజ, సన్నాఫ్ జె.బసవయ్య, తెలికాంనగర్, నంద్యాల రోడ్, కర్నూలు- 518002

పేరు : ఆర్.తేజస్వి
వయసు : 9 సం॥
చదువు : 4వ తరగతి
స్కూలు : కేంద్రీయ విద్యాలయం
హాబీలు: బొమ్మలు వేయడం, చదువుకోవడం, ఆడుకోవడం.
చిరునామా : ఆర్.తేజస్వి, డాటరాఫ్ ఆర్.గణేష్ కుమార్, క్వార్టర్ నెం.135/ఎ, సెక్షన్ 3, ఉక్కునగరం, విశాఖపట్నం-32.

పేరు : పి. గుఫ్రానా తబస్సుమ్
వయసు : 9 సం॥
చదువు : 4వ తరగతి
స్కూలు : దిఫాల్ హైస్కూల్
హాబీలు: చక్కగా బొమ్మలు గీయడం, పాటలు పాడడం, చదువుకోవడం.
చిరునామా: పి. గుఫ్రానా తబస్సుమ్, డాటరాఫ్ పి.అబ్దుల్ వాహిద్ (ఎలిమెంటరీ స్కూలు హెడ్‌మాస్టర్), దుద్యాల, కొత్తపల్లి మండలం, కర్నూలు.

పేరు : వై.రాజు
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు: పాటలు పాడడం, డ్యాన్స్ చేయడం, మంచి పుస్తకాలు చదవడం
స్కూలు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
చిరునామా: వై.రాజు, సన్నాఫ్ యెడవెల్లి ఎల్లయ్య, పాలకుర్తి, వరంగల్ -506252.

పేరు : పాలడుగు గోపీనాథ్
వయసు : 7 సం॥
చదువు : 2వ తరగతి
హాబీలు: టీవీ చూడడం, క్రికెట్ వంటి ఆటలు ఆడడం, అందరితో స్నేహంగా వుండడం.
స్కూలు : కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూలు
చిరునామా : పాలడుగు గోపీనాథ్, సన్నాఫ్ పి. వెంకటేశ్వర్లు, కేరాఫ్ సాయిచరణ్ స్టూడియో (మల్లారెడ్డి కాంప్లెక్స్), త్రిపురాంతకం, ప్రకాశం-523 326.